ఆదివారం
ప్రజాశక్తి
ఆగస్టు 8, 2004

కథా నిలయం
శ్రీకాకుళం

హాస్యానికి "పుట్టిల్లు" అల్లు

హ్యాపీ బర్త్‌డే

(8-8-2004నుండి 14-8-2004 వరకు)

ఆముక్త
6సం॥ 8-8-1998
పద్మ-గోవిందరెడ్డి
అల్వాల్-రంగారెడ్డి

ఎం. ప్రియదర్శిని
1సం॥ 8-8-2003
పద్మ-లక్ష్మణ్
విద్యానగర్ కాలనీ-ఆదిలాబాద్

మౌర్య శ్వేత
1సం॥ 8-8-2003
పరిత-సత్యనారాయణ
మధిర-ఖమ్మం

బిన్ను
2సం॥ 8-8-2002
విజయలక్ష్మి-సంజీవ
కేసముద్రం-వరంగల్

అనుమండ్ల స్పందన
1సం॥ 8-8-2003
లక్ష్మి-కిష్టయ్య
ధర్మన్నగూడ-రంగారెడ్డి

కె. ప్రవల్లిక
4సం॥ 8-8-2000
ధనలక్ష్మి-వెంకటేశ్వరరావు
ఐలవరం-గుంటూరు

కమ్మరి హరిచందన
5సం॥ 9-8-1999
లత-రవిప్రసాద్
షాబాద్-రంగారెడ్డి

పి. చైతన్యరాజ్(బిన్ను)
7సం॥ 9-8-1997
సుజాత-వెంకటేష్
షానగర్-కరీంనగర్

జి. ఉపేంద్ర తేజ
1సం॥ 10-8-2003
సుజాత-రంగస్వామి
తుగ్గలి-కర్నూలు

కె. సాయి కుమారి
6సం॥ 10-8-1998
లక్ష్మి-త్రినాధరావు
కొన్నావీధి-శ్రీకాకుళం

కొణతం ప్రణవి
1సం॥ 11-8-2003
రాధిక-సంజీవరావు
కేసముద్రం-వరంగల్

కోలా సూర్యతేజ
3సం॥ 12-8-2001
కనకలక్ష్మి-కిరణ్ కుమార్
లాలాచెరువు-రాజమండ్రి

సునీల్‌కుమార్
ఆగస్టు-13
ప్రమీల-తిరుమలరావు
కిడ్స్ ఫ్రైడ్ స్కూల్-కాకినాడ

ధనుష్
ఆగస్టు-12
మాలతీదేవి-శివకుమార్
కిడ్స్ ఫ్రైడ్ స్కూల్-కాకినాడ

ఎం. విష్ణువర్థన్
6సం॥ 12-8-1998
సుధారాణి-నీలకంఠం
పద్మారావునగర్-హైదరాబాద్

వై. మాధురీ సుప్రియ
5సం॥ 12-8-1999
రూప-శ్రీనివాస్
క్రాంతినగర్-విశాఖ

సుజయ్ మనోహర్
ఆగస్టు-12
శ్రీలత-శాంతకుమార్
కిడ్స్ ఫ్రైడ్ స్కూల్-కాకినాడ

సాయి ఫణికుమార్
7సం॥ 12-8-1997
విజయ-బ్రహ్మయ్య
పత్రింపాడు-ప॥గో॥

జోసఫ్‌డానీ
1సం॥ ఆగస్టు-2003
పద్మ-ఆనంద్
జియాగూడ-హైదరాబాద్

చింతపల్లి గీతాశ్రీ
3సం॥ ఆగస్టు2001
మహాలక్ష్మి-శ్రీమన్నారాయణ
పాలమూరు-ప॥గో॥

జి. సవిత
1సం॥ 13.8.2003
పరిమళ-వెంకటేష్‌నాయుడు
కుచ్చినెర్ల-మ॥నగర్

జ్యోత్స్న
7సం॥ ఆగస్టు-1997
ఉమ-యల్లయ్య
ఖమ్మం

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం



కవర్‌స్టోరీ అద్భుతం

జులై 25న ప్రచురించిన కవరుస్టోరీ "యానిమేషన్" ఎంతో అద్భుతంగా ఉంది. యానిమేషన్ అంటే తెలియని మాకు కళ్ళకు కట్టినట్లు చూపించారు. కవరుస్టోరీ ప్రచురించడంలో ప్రజాశక్తి 'స్టయిలే' వేరు. అందరికి అర్థమయ్యేశైలిలో ఉంటుంది. నేటి కంప్యూటర్ విభాగంలో యానిమేషన్ ప్రాముఖ్యత ఇంతగా ఉంటుందని ఊహించలేకపోయాము. ఉత్సాహం మరియు క్రియేటివిటీ, అంకితభావం, ఓర్పు, సహనం ఉన్నవారికి ఈ కోర్సు చేయడం ఎంతో లాభదాయకం. ఇతర దేశాలకంటే మనమేం తక్కువగాదు. ఆ టెక్నాలజీని ఉపయోగించుకుని విదేశాలకు వెళ్ళకుండానే మనమే యానిమేషన్‌ను అభివృద్ధి చేయవచ్చు.

తెలగతోటి శామ్యూల్,
ఉప్పుగుందూరు, ప్రకాశంజిల్లా

కోర్సుగా యానిమేషన్

కవర్‌స్టోరీ చదివిన తరువాత యానిమేషన్ అంటే ఏమిటి, దాని ప్రాసెస్, కెరీర్, ఉద్యోగావకాశాలు, ఎక్కడనేర్చుకోవచ్చు, అవుట్‌సోర్సింగ్, యానిమేషన్ రకాలు, సృష్టి గురించి విపులంగా తెలుసుకోగల్గాం. నా తోటి స్నేహితులకు, ఉపాధ్యాయులకు తెలిపినాను. "ఔరా" పేజీలో ఇస్తున్న విజ్ఞాన విషయాలు అబ్బురపరుస్తున్నవి. జీవనశైలి పేజీలో అంపశయ్య నవీన్‌గారి కళాజీవితం, వ్యక్తిగతజీవితం వేర్వేరా? చాలాబాగుంది. ఆరోగ్యం పేజీలో ప్రతీవారం ఏదో ఒక అంశంపై ఇస్తున్న సమాచారం

బాగుంది. ఈవారం అన్ని శీర్షికలు మమ్ములనెంతో ఆకట్టుకున్నాయి.

కామిడి సతీష్ రెడ్డి,
జడలపేట, వరంగల్‌జిల్లా



టూరిస్ట్‌గైడ్ బాగుంది

దక్షిణకాశీ రామేశ్వరం. ఇంతమంచి పుణ్యక్షేత్రం గురించి చదువుతుంటే మా మనసంతా ధ్యానసముద్రంలో మునిగిపోయింది.

- మేడూరి సత్యనారాయణ,
తిరువూరు, కృష్ణాజిల్లా

ఆదివారం అనుబంధంలో దక్షిణకాశీ రామేశ్వరం, చిదంబరం, విశేషాలు చదివి ఎంతో ఆనందించాము. అద్భుత శివలింగ ఆలయాలున్న వాటిలో తూర్పుగోదావరిజిల్లాలో ఉన్న శివకోడు ఆలయం. టూరిస్ట్‌గైడ్ బాగుంది.

- జె సుధాకరరావు, కాకినాడ.

ఆసక్తిదాయకం

సంచికలోని శీర్షికలన్నీ ఆసక్తిదాయ కంగా ఉంటూ రంజింపజేశాయి. ముఖ్యంగా 'ఆరోగ్యం' శీర్షిక ఎంతో ఉపయుక్తంగా ఉంది. ఈ వారం తెల్లమచ్చల గురించి తెలుసుకున్నాం. అవి ప్రమాదకరం కావని తేటతెల్లమయింది. అదేవిధంగా బాలలకథలు కూడా బావుంటున్నాయి. "ఔరా" శీర్షిక గురించి చెప్పనక్కర్లేదు. అది పత్రికకే హైలెట్. మంచిమంచి విషయాలు తెలుపుతున్నందుకు కృతజ్ఞతలు.

- ఎం డి ముస్తఖీమ్, కొల్లాపూర్,
మహబూబ్‌నగర్ జిల్లా

మనలో మాట

నా పేరు చెప్పి...

మీరు మా బందరు వాళ్ళయితే-

మన ఊళ్ళో కోనేరు సెంటరు గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు గదా?

మీరు మా ఊరి వాళ్ళు కాకపోతే-

మా ఊళ్ళో కోనేరు సెంటరు గురించి ఏమి చెప్పినా అతిశయోక్తులంటారు!

అంచేత -

మా ఊళ్ళో కోనేరు సెంటరు గురించి ముక్తసరిగా చెప్పి ముగించేస్తాను !

ఎవరైనా మా ఊరొచ్చి ఫలానా వారు ఇంటో వున్నారా అని వాకబు చేసినప్పుడు - బయటకు వెళ్ళేరనే సమాధానం వినిపిస్తే - ఎక్కడికి వెళ్ళేరోనని దిగులు పడక్కర్లేదు!

మా మనిషి కచ్చితంగా కోనేరు సెంటర్లోనే వుంటాడు!

మా ఊళ్ళో అతి ముఖ్యమైన సెంటరు అదొక్కటే!

మా ఊరికి కోనేరు సెంటరు ఒక పెద్ద అలంకారం! ఆ సెంటరుకి బోలెడు చరిత్ర కూడా వుంది. తెల్లదొరల పాలనకు ఆసెంటర్లోనే నిరసన ప్రదర్శనలు భారీ ఎత్తున సాగేయి!

ఆ సెంటర్లోనే తోట నరసయ్యగారు జాతీయ పతాకాన్ని గర్వంగా ఎగరేసి లాఠీ దెబ్బలు తిన్నారు!

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే -

ఆ సెంటర్లో నిలబడి మీక్కావలసిన మనిషిని పేరుతో పిలవండి గట్టిగా!

ఏదో మూల నుంచి 'ఓయ్' అని బదులిస్తాడు!

కాకపోతే -

ఆ మనిషి పేరు సుబ్బారావైతే మాత్రం - అనేకమైన గొంతులు 'ఓయ్' అని బదులు పలుకుతాయి!

మా ఊళ్ళో సుబ్బారావులు చాలా మంది వున్నారు.

ఇప్పుడంటే షోకు పేర్లు విరివిగా పుట్టుకొచ్చేయ్ గానీ - నా చిన్నతనంలో - ప్రతి ఇంటోనూ తప్పనిసరిగా ఒక సుబ్బారావు వుండేవాడు!

మా ఊళ్ళో అతనొక సుబ్బారావు. బాగా డబ్బున్న ఆసామి. ఎంత డబ్బుందో అంత లోభి. ఎంగిలి చేత్తో కాకిని కూడా తోలేవాడు కాదు!

ఆ సుబ్బారావింటికి వాళ్ళ బావమరిది చుట్టం చూపుగా వచ్చేడు. వచ్చిన వాడ్ని వచ్చినట్టే నిలబెట్టి 'ఇదేనా రావడం' అని అడిగేట్ట సుబ్బారావు.

అవును బావ! అక్కను చూచి వెడదామనీ... అన్నాట్ట బావమరిది. సుబ్బారావు వాళ్ళావిడకి ఆర్డరు వేసేడు -

"ఇదిగో మీ తమ్ముడొచ్చేడు. నిన్ను చూచి వెళ్ళిపోతాట్ట. ఒకసారొచ్చి కనిపించు!"

ఆవిడ వచ్చింది "బాగున్నావా తమ్ముడూ" అని తమ్ముడ్ని ప్రేమగా పలకరించింది.

"వంట ప్రయత్నం చేయద్దు. నిన్ను చూచి వెళ్ళిపోతాట్ట. అంతే! మా ఇంటో భోం చేయకపోయినా బామ్మర్దీ - ఉయ్యూర్లో బస్సాగుతుంది. అక్కడ కనకయ్య హోటల్లో భోంచెయ్! ఆ హోటల్లో చేపల పులుసు మా ఇంటో మాదిరి అదిరిపోతుంది. అక్కడ కూడా భోం చేయకపోతే నా మీదొట్టే! నా పేరు చెప్పు... స్పెషల్గా వడ్డిస్తాడు!" అన్నాడు సుబ్బారావు.

సుబ్బారావనే పేరుకి ఈ సుబ్బారావు ఇంత గొప్ప గౌరవం కలిగిస్తున్నందుకు తట్టుకోలేక సదరు బామ్మర్ది కన్నీరు పెట్టుకున్నాట్ట!

మన పాలకుల్లోనూ ఇలాంటి సుబ్బారావులుంటారనీ వేరే చెప్పక్కర్లేదుగా.... ఆ ఏలిక సుబ్బారావులకు బడ్జెట్ల కేటాయింపుల్లో ప్రజలు బామ్మర్దులే! ❖

ఈ సంచికలో . . .

ఔరా!	3
కార్టూన్ కదంబం...	4
కవర్ స్టోరీ	5
కథ	8
బాలల కథ	11
బాలనేస్తాలు	12
ఇంతిసంగతులు	16
కచేరి	17
పుస్తక పరిచయం	20
కళాసాహితి	22
న్యాయసలహాలు	24

ఇంకా...

ద్వేషంతో కాదు, ప్రేమతో గెలవాలి

జీవనశైలి ... 10

వినోదం మాటున విషాదం

రియల్‌స్టోరీ ... 14

మూర్ఛరోగం అంటే ఏమిటి?

ఆరోగ్యం ... 18, 19



అరేబియా సముద్ర తీరం కొచ్చిన్

టూరిస్ట్‌గైడ్ ... 21

ఔరా!

స్పైడర్ రాబర్ట్

ఎలైన్ రాబర్ట్ అనే ఇతగాడే నిజమైన "స్పైడర్ మాన్". ఇండోనేషియా సాటిలైట్ కార్పోరేషన్ బిల్డింగ్ 27 అంతస్తులూ ఆసాంతం సాలెపురుగులాగా ఎక్కేశాడు. ఫ్రెంచ్ అర్బన్ క్లైంబర్ అయిన ఈ ఎలైన్ రాబర్ట్ని "స్పైడర్ రాబర్ట్యా... స్పైడర్ మేనూ" అని ముద్దుగా పిలుచుకుంటారుట. ప్రపంచ వెండితెర మార్కెట్టు "గల్లాపెట్టె"ని("బాక్సాఫీసు"లేండి!) బద్దలకొట్టిన నెంబరు వన్నూ ఈ "సాలెపురుగు మనిషి-2"(స్పైడర్మాన్-2). అయితే సినిమాలో ఈ మనిషిగా నటించిన టోబే మెగుయిర్ సినీ మాయా టెక్‌గా 'కట్ అండ్ యాక్షన్'లో వాయిదా పద్ధతిలో నటించాడు. ట్రాలీలు, క్రేన్లు, వెస్ట్‌బెల్ట్ వైర్లు లాంటి సాంకేతిక సహకారం ఉంటేనే నటిస్తాడు. కానీ మన ఈ నిజమైన స్పైడర్మాన్ రాబర్ట్ మాత్రం "రెడీ...ఫ్యాన్స్ ఆఫ్ లైట్స్ ఆన్...యాక్షన్...స్టార్ట్" అంటే మొదలెట్టి, "కట్...కట్" అంటే ఆగిపోయి...ఇలా చేయలేదు. కెమేరా, లైటింగ్, క్రేన్లూ, వైరుబెల్టులు ఇవేవీ లేకుండా ఏకాఎకిన ఆ ఇరవైఏడంతస్తులూ ఎక్కిపడేశాడు. 110 మీటర్ల ఎత్తుని అవలీలగా ఎగబాకి ప్రపంచం మొత్తంలోనే ఉన్న 70 మంది స్కై స్క్రాపర్స్ రికార్డుని అధికమించేశాడు.

కత్తిప్రూఫ్ కోటు!

బులెట్‌ప్రూఫ్ కోటులాగా ఈ "కత్తిప్రూఫ్ కోటు" ఎక్కడిదిరా బాబూ అని ఆశ్చర్యపోతాం మనం. నిజంగానే మార్కెట్టులోకి వచ్చిందండీ! చలికాలం వెచ్చటి కోట్లు, వానాకాలం రెయిన్ కోట్లు, టై కింద ధరించే వెస్ట్ కోట్లు ఇలా కోట్లు రకాలున్నాయి. ప్రమాదాల్నుంచి రక్షణ కోసమని బుల్లెట్‌ప్రూఫ్ కోటు, ఫైర్‌ప్రూఫ్ కోటు ఉన్నాయని మనకు తెలుసు. కానీ ఇటీవలే జపాన్ వారు ఈ నైఫ్‌ప్రూఫ్ కోటుని తయారుచేశారు. కత్తిపోట్లనడ్డగించే ఆ కోటు పిల్లలకు, ఆ పిల్లల తల్లిదండ్రులకు మనశ్శాంతినిచ్చే కోట్లు అని జపానుజనం భావిస్తున్నారు. పిల్లలపై అమానుషదాడులు విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో ఈరకపు కోటు కొంతలో కొంత ఊరటే కదా! మిలటరీ, పోలీసు విభాగాలకోసం తయారయ్యే బుల్లెట్‌ప్రూఫ్ కోటులలో వాడే పదార్థాలను పరిశీలించి ఈ కత్తిప్రూఫ్ కోటు డిజైన్‌చేశామని దాని తయారీదారి కంపెనీ 'మాద్రి' అంటోంది. దీని గురించి ఓ వెబ్‌సైట్ కూడా తెరిచారుట. ఇంతకీ దీని ఖరీదు 46,095 యెన్‌లు. అంటే 19,693 రూపాయలన్నమాట.

నెలకి 2కేజీల బరువుపెరిగే ముగ్గురు పిల్లల తల్లి!!

"కుటుంబభారమంతా ఆ తండ్రే చూస్తున్నాడు నాయనా" అనే మాట మనం వినడం సహజం. కానీ ఈ ఫొటోలోని ఆ ముగ్గురు పిల్లల తల్లిని చూస్తే కుటుంబ ఆర్థికభారం గురించే కాదుగానీ ఆ పిల్లల బరువుని ఎలా మోసింది నాయనో అనిపిస్తుంది. పెద్దాడు ఏడేళ్ళ వికాస్ 62 కేజీలు. రెండోవాడు ఐదేళ్ళ విశాల్ 50కేజీలు, చిన్నది రెండేళ్ళ సుమన 42కేజీలు. ఆ కన్నతల్లి ఆషా సయానీ కంటే కేవలం 4కేజీలే తక్కువ. నెలకు 2కేజీల చొప్పున బరువుపెరిగిపోతున్న ఆ పిల్లల భారం గురించి వింటుంటే మన హృదయాలు బరువెక్కుతాయి. రాజస్థాన్‌లోని సిఖర్ గ్రామానికి పొలిమేరలోని మలియోం కి ఢర్డీ నివాసితులైన రామావతార్, ఆషా సయానీ ల సంతానం ఈ ముగ్గురు. ఈ ముగ్గురి అసహజ ఎదుగుదలను ఆపడానికై ఢిల్లీ, ముంబయ్, జైపూర్ మహానగర ప్రముఖ వైద్యశాలలకు తిరుగుతున్నారు. గిన్నీస్ బుక్ రికార్డుల్లోకి ఎక్కించదగ్గ ప్రమాణాలున్నాయనీ కొందరు అంటున్నా...ఈ తల్లిదండ్రులకేమీ సంతోషంగా లేదు. ముందు వీరి బరువు పెరుగుదల ఆగే మార్గం చూపమని కనబడిన వారిని, కనబడని దేవుళ్ళను కోరుతున్నారు.



కార్టూన్ కదంబం

మన
మేఘమథనం
వల్లే వర్షాలు కురిసి
జలాశయాలు
పొంగి పొర్లు
తున్నాయి!


బహిష్కరణ
ఎన్‌డిఎ
పార్లమెంటు స్థాయీ
సంఘాల ఏర్పాటు
నారు

ఆర్నెల్లల్లో
తెలంగాణా
ఏడాదిలోగా
తెలంగాణా
మహారాష్ట్ర
ఎన్నికల తర్వాత
తెలంగాణా
తెలంగాణాకు
తొందర లేదు
ఢిల్లీ

హాస్యానికి 'పుట్టిల్లు' అల్లు



పదిహేనేళ్ళు నిండిన ఆ కుర్రవాడు చదువునెప్పుడో గాలికొదిలేశాడు. తండ్రితో పాటు వ్యవసాయం అయినా చూసుకొమ్మంటే పొలం దున్నడం మానుకుని తన తోటివారిని వెంటేసుకుని రోజంతా ఊర్లో రోడ్లు దున్నడం మొదలెట్టాడు. ఈ జులాయితనానికి తోడు నాటకాల పిచ్చి. పెద్దవాళ్ళు రాత్రిళ్ళు అలా నిద్రపోగానే మెల్లగా లేచి ఊర్లోకి నాటకాలు చూసేందుకు వెళ్ళేవాడు. నాటకాలవాళ్ళతో స్నేహం చేసి ఏదైనా చిన్నవేషం ఇమ్మని అడగడం తన నిత్యకృత్యంగా చేసుకున్నాడు. వేషం అంత త్వరగా ఎవరూ ఇవ్వలేదు. అయినా "విక్రమార్కుని పట్టు" వదల్లేదు.

ఓ సుముహూర్తాన భక్త ప్రహ్లాద నాటకంలో బృహస్పతి వేషం ఖాళీగా ఉందని మిత్రుని ద్వారా తెలుసుకుని డేరా వద్దకు పరుగెత్తుకు వెళ్ళి వేషం ఇమ్మని అడిగాడు. నాటకోత్సాహమే తప్ప నటనానుభవం లేని నీవు పోషించలేవన్నాడు. అంతే చేజారిపోతున్న అవకాశాన్ని దొరకపుచ్చుకోవాలని నాటకం కంట్రాక్టరు చేతులు పట్టుకుని "తమరలా అనకండి. నాకు పతిభిక్ష పెట్టింది - అదే బృహస్పతి" భిక్ష. ఇవి చేతులు కావు: కాళ్ళనుకోండి. నా చర్మంతో మీ సైజుకు చెప్పులు కుట్టిస్తాను. నాకు తెలిసిన గొడారి వాడున్నాడు. గట్టివాడు. మీ రుణం ఉంచుకోను. మీ పేరు మారుమ్రోగిస్తాను. మీ పేరు నిలబెడతాను. నన్ను నమ్మండి" అంటూ ప్రాధేయపడ్డాడు. చివరికి వేషం వేసేందుకు మూడున్నర ఇచ్చేట్టు ఒప్పందం కుదిరింది. నాటకంలో వేషం బాగానే కుదిరింది. నాటకం సంగతి ఇంట్లో తెలియకుండా జాగ్రత్తపడ్డాడు. తరువాత మూడు రోజులు గడిచాయి. కాంట్రాక్టరు హనుమంతరావు రోడ్డు మీద ఎదురుపడి అనుకున్న మూడున్నర ఇమ్మని నిలదీశాడు. తన వద్ద లేదన్నాడీ కుర్రవాడు. అతనేమో ససేమిరా అన్నాడు. దాంతో పదిమందీ గుమిగూడారు. అంతా కలిసి 'రూపాయిన్నర"కు సెటిల్ చేశారు. ఇంట్లో అడిగితే ఇవ్వరని బియ్యం దొంగతనం చేసి వాటిని పచారీ కొట్లో అమ్మి కాంట్రాక్టరుకు ఇచ్చి రుణ విముక్తుడయ్యాడు.

అలా ఆనాడు నాటకాల వేషాల కోసం అష్టకష్టాలు పడిన ఆ కుర్రవాడు రంగస్థలంపైనే తన నటనకు మెరుగులు దిద్దుకుని ఆ తరువాత తెలుగు సినీ రంగంలో అరశతాబ్దానికి పైగా విలక్షణ కామెడియన్‌గా ఎదిగి, సహస్రాధిక చిత్రాల్లో నటిస్తాడని ఎవరూ ఊహించి ఉండరు. నాటి ఆ కుర్రవాడే జులై 31న తన 82వ ఏట కన్ను మూసి తనదైన హాస్య శకానికి

ఆయన అచ్చ తెలుగు సినిమా హాస్యానికి అచ్చూ హల్లూ
అతని ఊరు పాలకొల్లు
హాస్యానికి వీరమల్లు
వేయి చిత్రాలు దాటడం అతనికే చెల్లు
నాటకరంగంపై నటనకు ఓనమాలు
సినిమాల్లో పరచిన నవ్వుల హరివిల్లు
సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య సమరయోధుడుగా
హోమియో వైద్యుడుగా బహుముఖ ప్రతిభతో
ఓ వెలుగు వెలిగిన తెలుగు సినీ నవ్వుల మల్లు
ఈ అల్లు రామలింగయ్య.

హెచ్.రమేష్ బాబు

ముగింపు పలికిన 'అల్లు రామలింగయ్య'

అల్లు రామలింగయ్య పేరు తలచుకోగానే మనకు నవ్వు తన్నుకు వస్తుంది. ఆంగికం, అభినయం, తనదైన శైలిలో ప్రదర్శించే మేనరిజమ్స్, డైలాగ్ డెలివరి అనితరసాధ్యమైనది. తన "అల్లు మార్క్" హాస్యంతో ఓ నాలుగు తరాల సినీ ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించిన నవ్వుల మిల్లు అల్లు.

1922 అక్టోబర్ 1న పాలకొల్లులో పుట్టిన అల్లు రామలింగయ్య నాటకాల్లో పలువేషాలు వేసి తన నటనకు తానే మెరుగులు దిద్దుకున్నాడు. క్రమంగా సాంఘిక నాటకాల్లో నటించడం ప్రారంభించాడు. 'ప్రజానాట్యమండలి'లో చేరడంతో అల్లు రామలింగయ్య నట జీవితం మలుపు తిరిగిందనే చెప్పాలి.

తెనాలి నాటక కళాపరిషత్ పోటీల్లో 'కూడుగుడ్డ' నాటకంలో శాస్త్రి పాత్రధారి అల్లు రామలింగయ్య, 'పరివర్తన' నాటకంలో ముఖ్యనటుడు డా॥ గరికిపాటి రాజారావు ఇద్దరూ ఉత్తమ నటుడి అవార్డుకు పోటీ పడ్డారు. ఈ పోటీల న్యాయనిర్ణేత దేవులపల్లి కృష్ణశాస్త్రి అంతిమ నిర్ణయానికి రావడానికి 'దివి నుండి భువికి దిగి' రావలసిన పనైంది. చివరికి రాజారావును ఉత్తమ నటుడిగా ఎంపిక చేసి, మన అల్లును ప్రత్యేక బహుమతి గ్రహీతగా ప్రకటించాడు. ఈ సంఘటన అల్లు నటనలోని సీరియస్‌నెస్‌ను రుజువుపరుస్తుంది.

రంగస్థలంపై 'పశ్చాత్తాపం'లో పేరయ్య శాస్త్రి పాత్రలో అల్లు నటనా విశ్వరూపాన్ని ప్రదర్శించారు. ఇంకా "ఆదిలేని సంసారం", "పరివర్తన" వంటి నాటకాల్లో పేరు తెచ్చే పాత్రలు చేశారు. ప్రజానాట్యమండలిలో గరికపాటి రాజారావుతో అల్లుకు ఏర్పడిన పరిచయం, ఆయనకు అనుంగు సహచరునిగా చేసింది. 1952లో గరికపాటి రాజారావు జమునను హీరోయిన్‌గా పరిచయం చేస్తూ తను హీరోగా నటిస్తూ నిర్మించిన 'పుట్టిల్లు'లో శాస్త్రి తరహా (నొసట అడ్డంగా విభూతి రేఖలు, చేతిలో గొడుగు) పాత్రకు తీసుకున్నారు అల్లుని.

సినిమాల్లో అవకాశమైతే వచ్చింది కానీ, 'పుట్టిల్లు' సినిమాటోగ్రాఫర్ వి.ఎన్.రెడ్డికి అల్లు నటన ఎందుకో నచ్చలేదు. ఈ వి.ఎన్.రెడ్డి సామాన్యుడు కాదు. బొంబాయిలో రాజ్‌కపూర్, భరత్ భూషణ్, దిలీప్ కుమార్, నర్గీస్, మీనాకుమారి వంటి వారు నటించిన చిత్రాలకు పనిచేసిన కెమెరామెన్. దాదాపు అంతా కొత్తవారితో తీస్తున్న ఈ చిత్రంలో అల్లు నటన మోతాదుమించి అతిగా ఉండటంతో ఏకంగా సినిమాలోంచే తీసేయమన్నారు. మిక్కీమౌస్ లాంటి మొహం సినిమాలకు పనికిరాదన్నారు. రాజారావుకిది ఇష్టం లేదు. ఇద్దరి మధ్య అభిప్రాయభేదాలు వచ్చి కొంతకాలం షూటింగ్ ఆగిపోయింది. చివరికెలాగో రాజీకుదిరింది. 'పుట్టిల్లు' 1953లో విడుదలై ఆర్థికంగా పరాజయం పొందినా అల్లు నటన మెప్పుపొందింది. అవకాశాలు వాటంతటవే తలుపు తట్టాయి.

ఈ నేపథ్యంలో అల్లు రామలింగయ్య వద్దంటే డబ్బు, పల్లెపడుచు (1954), మిస్సమ్మ, దొంగరాముడు (1955), ఇలవేలుపు, బాల సన్యాసమ్మ (1956), భాగ్యరేఖ (1957), మాబాబు, పెళ్ళినాటి ప్రమాణాలు (1958), రుణానుబంధం, అభిమానం, సహస్రశిరచ్ఛేద అపూర్వ చింతామణి (1960), కృష్ణకుచేల, బావమరదళ్ళు (1961), మంచిమనసులు, సిరిసంపదలు (1962), శ్రీకృష్ణార్జునయుద్ధం, ఇరుగు పొరుగు (1963), మూగమనసులు, దాగుడు మూతలు (1964), నాదీ ఆడజన్మే (1965), ఆత్మ గౌరవం (1966), ఉమ్మడి కుటుంబం, ప్రైవేటు మాస్టారు (1967), తిక్క శంకరయ్య, నిలువుదోపిడి, దేవకన్య, అత్తగారూ కొత్తకోడలు, భలే కోడళ్ళు, బాగ్దాద్ గజదొంగ, పాపకోసం, వింత కాపురం (1968), బుద్ధిమంతుడు (1969), అల్లూరి సీతారామ రాజు (1974), వయసొచ్చినపిల్ల, బలిపీఠం, ఈ కాలం దంపతులు, ముత్యాలముగ్గు (1975), పిచ్చిమా రాజు, ప్రేమాయణం, నాపేరే భగవాన్, పొగరుబోతు (1976) బుర్రిపాలెం బుల్లోడు (1979), ఎవరికివారే యమునాతీరే, చీకటివెలుగులు, బంగారు కలలు, సుప్రభాతం, పాడి పంటలు, మనవూరి కథ, ఎదురులేని మనిషి, మొనగాడు, యమగోల వంటి 1030 చిత్రాల్లో ప్రదర్శించిన నటన నభూతోనభవిష్యతి. ఆయన చివరి సినిమా 'జై'.





కె.విశ్వనాథ్, బాపు, ఆదుర్తిల చిత్రాల్లో అల్లు రామలింగయ్య పాత్రలు తప్పనిసరి. శుభలేఖ, శంకరాభరణం, సప్తపది, మావిచిగురు, అందాల రాముడు చిత్రాల్లోని ఆయన పాత్రలు మరుపురానివి. చిరంజీవి హీరోగా నటించిన రౌడీఅల్లుడు, దొంగ, కొండవీటి దొంగ వంటి చిత్రాల్లో రావుగోపాలరావును అనుక్షణం నిరుత్సాహపరిచే అల్లరి పాత్రలు అల్లుకు కొట్టిన పిండి. ట్రాజెడీ పాత్రలు కూడా పోషించి మెప్పించారాయన. గ్రామ పెత్తందార్లకు సలహాలిచ్చే గుమాస్తాగా, కరణంగా, పూజారిగా ఆయన నటించిన పాత్రలు పాపులరైనవి.

అల్లు రామలింగయ్య సినిమాల్లోనే కాదు

అవార్డుల పరంపర

అల్లు రామలింగయ్య 50 ఏళ్ళకుపైగా సినిమాల్లో నటునిగా అందించిన సేవలకు గుర్తింపుగా లభించిన గౌరవాలు చాలానే వున్నాయి. గత జనవరిలో కువైట్, దుబాయ్‌ల్లోని తెలుగు సినీ అభిమానులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. హాస్యనట సామ్రాట్, హాస్యకళా ప్రపూర్ణ, శతాబ్దపు ఉత్తమ కమెడియన్, తమిళులైతే 'కలైసెల్వమ్', 'నడిగర సంగం బిరుదులతో సత్కరించారు. ఫిలింఫేర్, చిత్తూరు కల్చరల్ అకాడమి, సికా, దక్షిణ భారత సినిమాటోగ్రాఫర్స్ వారి లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డులు, తానా వారి 'తానాకళానిధి' అవార్డు, వంశీ రేలంగి వారి 'మిలీనియం హాస్య సామ్రాట్' బిరుదుతో బంగారు కంకణం అందుకున్నారు. ఇంకా 'హాస్యరసజ్ఞ', 'హాస్య నట శిరోమణి' వంటి అవార్డులేగాక 1990లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ బిరుదాన్నిచ్చింది. రేలంగి తర్వాత ఈ బిరుదు అందుకున్న తెలుగు కమెడియన్ ఈయనే. 2001లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాకరమైన 'రఘుపతి వెంకయ్య అవార్డు'తో గౌరవించింది. ఈ అవార్డు అందుకున్న తొలి తెలుగు కమెడియన్ అల్లుగారే! రెండేళ్ళ క్రితం పాలకొల్లులో ఆయన విగ్రహాన్ని నెలకొల్పారు.



వ్యక్తిగత జీవితం కూడా కామెడీ భరతమే. ఒకసారి రాజమండ్రికి షూటింగ్ కోసం వెళుతూ నెల్లూరు స్టేషన్‌లో ఆగారు అల్లు. దాంతో స్టేషన్‌లో రైలు ఎక్కేవారు సైతం ఆయన చుట్టూ మూగారు. వాళ్ళు విష్ చేస్తుంటే 'వూఁ వూఁ" అంటూ ప్లాట్‌ఫారం మీద వెతుకుతున్నారు. అభిమానులంతా "ఏమిటి సార్... ఏదైనా పోయిందా" అని అడిగారు. అందుకాయన "పర్సు పడిపోయింది పర్సు" అని వెతుకుతూ ఉంటే ట్రైన్ కూతవేసింది. "పోన్లెండి... టైమైపోయింది వస్తా.." అని ఆయన బండెక్కారు. బండి బయల్దేరింది. వెనక్కి తిరిగి చూస్తే కింద అంతా పర్సుకోసం వెదుకుతూనే వున్నారు. అది చూసి తోటివారితో "ఊరికే సరదాకే. పర్సూలేదు. ఏం లేదు. కొంతసేపు వెదుకుతారు. తర్వాత నన్ను తిట్టుకుంటారు. తిట్లు, దీవెనలు రెండు తగలాలి ఆర్టిస్టుఅనే వాడికి" అంటూ నవ్వారాయన.

"బొందిలో ప్రాణం ఉన్నంత వరకూ నటించాలన్నదే నా ధ్యేయం. నటించడంలోనే నాకు కావలసిన విశ్రాంతి లభిస్తుంది" అనే అల్లు ఇంట్లో కూడా అల్లరిగా అందరిని విసిగెత్తించేవాడు. అయినా అంతా ఈయన్ని ఆనందంగా భరించేవారు. కారణం సినిమాల్లోకి వచ్చిన కొత్త రోజుల్లో నలుగురు పిల్లల కుటుంబాన్ని పోషించడానికి ఆయనపడ్డ కష్టాల ముందు ఈ విసిగింపు మాకు లెక్కకాదంటారు. ఒక్క సినిమాలసంపాదన సరిపోక విజయావారు అమ్మగా ఎస్.వి.రంగారావు వద్ద ఉన్న స్టాండర్డ్ కారు కొని టాక్సీగా మార్చారు అల్లు. కానీ సరిగ్గా నడిచేది కాదు. ఎక్కడెక్కడ ఆగిపోతుందో తెలీదు. ఆగిపోయిన చోటల్లా దాన్ని నెడుతూ ఆయన పడ్డ పాట్లు స్వయంగా అభినయించి చెప్పేవారు.

1972లో నిర్మాతగా గీతా ఆర్ట్స్ సంస్థను ప్రారంభించి "బంట్రోతు భార్య (1974),దేవుడే దిగి వస్తే (1975), బంగారు పతకం" చిత్రాలు తీశారు. ఆ తరువాతి కాలంలో అల్లు ఆర్ట్స్ బ్యానర్‌పై 'డబ్బు భలే జబ్బు' తీశారు కూడా. ఈ గీతా ఆర్ట్స్ సంస్థ పక్షాననే ఆయన కుమారుడు అల్లు అరవింద్ చాలా హిట్ చిత్రాలను నిర్మించారు. మనవూరి పాండవులు, పునాదిరాళ్ళు చిత్రాల్లో నటించి సినిమాల్లోకి ప్రవేశించిన చిరంజీవిని తన అల్లుడిగా చేసుకున్న అల్లు చిరంజీవిని సరదాగా "రౌడీ అల్లుడూ" అని సంబోధించడం ఆయనకు మాత్రమే సాధ్యమైంది.

అల్లు తన స్వగ్రామం పాలకొల్లులోని ఎలిమెంటరీ పాఠశాల అభివృద్ధికి, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేశారు. రాజమండ్రి పట్టణంలో ఏడాది క్రితం ఏర్పాటైన హోమియోపతిక్ కాలేజికి రెండు లక్షల రూపాయల విరాళం ఇచ్చారు. ఈ కళాశాలకు "అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియోపతిక్ కళాశాల"గా పేరు పెట్టారు. ఒకసారి ఎవరో హరిజనుడిని తాకాడని ఇంట్లోకి రానివ్వకుండా బిందెడు నీళ్ళు ఆయనపై కుమ్మరించారు. అయినప్పటికీ దళితులతో సాన్నిహిత్యం పెంచుకొన్నారు. ఒకనాడు దళితులకు తన ఇంట్లో సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. వారి ఎంగిలి విస్తర్లను అల్లు దంపతులు ఎత్తివేశారు.

నటుడుగా ఆయన 1116 సినిమాల్లో నటించాలని, తన జీవిత చరిత్రను అక్షరబద్ధం చేయాలని ఆశించారు. కానీ అవేమీ నెరవేరని కోరికలుగా మిగిలాయి. తెలుగు టాకీల మలితరంలో ఇండస్ట్రీలోకి ప్రవేశించి, రేలంగి, రమణారెడ్డి వంటి ప్రతిభావంతులైన కమెడియన్లకు సమకాలికుడిగా చెప్పుకోదగిన నటుడు అల్లు. రాష్ట్ర ప్రభుత్వం అల్లురామలింగయ్య స్మారక అవార్డు నెలకొల్పనున్నట్లు ప్రకటించడం హర్షణీయం. అల్లు రామలింగయ్యకు సరైన నివాళి.

మరవని ఆశయ ధ్వని

పాలకొల్లులో అల్లు రామలింగయ్య ఓ మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టారు. హైస్కూలుతోనే చదువు ముగించాల్సి వచ్చింది. ఆయన అభిప్రాయాలు, అభిరుచులు రాజకీయాల వైపు, నాటకాల వైపు మళ్ళాయి. చిన్న వయసులోనే తనను మహాత్మాగాంధీ, రష్యన్ విప్లవ నేత లెనిన్ ఆకర్షించినట్టు చెప్పేవారు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో పాటు సమసమాజ చైతన్యాన్ని కూడా గుర్తించడం ఆయన పరిశీలనా శక్తికి ఒక నిదర్శనం. గాంధీజీ ప్రభావంతో ఆయన అస్పృశ్యులను ఆదరించడం, ఇంటికి పిలిపించడం వంటి పనులు మొదలెట్టారు. ఆనాడు నటీనటులను తక్కువ మనుషులుగా చూడటం ఆయనకు కష్టం కలిగించింది. అదే ఆయనలో నాటకాల పట్ల అభిమానం పెరగడానికి కారణమైంది. క్విట్టిండియా ఉద్యమం సందర్భంగా ఆయనను అరెస్టు చేశారుజైలులో కూడా నాటకాలు, కళారూపాలతో అధికారులను మెప్పించారట. తిరిగివచ్చాక మరింత ఉత్సాహంతో స్వాతంత్ర్య పోరాట పద్యాలు పాటలు పాడుతూ తిరిగారు. ప్రజానాట్యమండలిలో పని చేశారు. పద్మశ్రీ అవార్డు వచ్చినపుడు ప్రజాశక్తిలో వ్యాసం ఆయన దృష్టికి రాలేదు. నాకు పద్మశ్రీ వచ్చినందుకు సంతోషం కాదు, పార్టీ తరపున ఎవరూ రానందుకు విచారం కలిగింది అంటూ ఎంతో ఉద్వేగంగా అన్నారు. సిపిఎం అగ్రనాయకులు పుచ్చలపల్లి సుందరయ్య, స్వాతంత్ర్యయోధులు, కమ్యూనిస్టు అగ్రనాయకులు ఉద్దరాజు రామం పట్ల ఆయనకు ప్రత్యేక గౌరవం. ప్రజాశక్తికి జీవిత చందాదారుడుగా వున్న అల్లు రామలింగయ్య పత్రిక రాకపోతే ఫోన్ చేసి మరీ తెప్పించుకునేవారు. ఇటీవల మరణించిన హిందీ హాస్యనటుడు మొహమూద్, తమిళనటి మనోరమ మినహా వెయ్యికి పైగా చిత్రాలలో నటించిన వారు మరిలేరు. తనకు జీవితం ఇచ్చిన డాక్టర్ గరికపాటిరాజారావు, ఆయన మిత్రుడైన ప్రజావైద్యుడు డాక్టర్ పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి ల పేర్లు కలసి వచ్చే విధంగా రామరాజా ప్రొడక్షన్స్ స్థాపించి తన మొదటి నాటకమైన పశ్చాత్తాపం ను సినిమాగా తీస్తానని ఇండియాటుడేకు చెప్పారు. ఆ తీరని కోరికే ఆయన స్వభావాన్ని వెల్లడిస్తుంది. 'ప్రేక్షకులు మానసికంగా ఎదిగేందుకు సినిమా ఉపయోగపడాలి తప్ప వారిని మరింత దిగజార్చి మురికి కూపంలో మునకలేయమని ప్రోత్సహించకూడదు' అని స్పష్టంగా చెప్పిన అల్లు రామలింగయ్య గిలిగింతల హాస్యం, ఆశయాల పట్ల అభిమానం కళాకారులకు కళాభిమానులకు స్ఫూర్తినిస్తూనే వుంటాయి. స్వాతంత్ర్య యోధునిగా, ప్రజానాట్యమండలి కళాకారునిగా, కమ్యూనిస్టు అభిమానిగా కళాజీవితం ప్రారంభించిన ఆయన ఆఖరి వరకూ ఆ ఆశయాల పట్ల తన అభిమానాన్ని నిలబెట్టుకున్నారు.

- తెలకపల్లి రవి



ఓటి బతుకులు

షేర్ మహమ్మద్‌పేట చెరువులో ఎన్నడూ ఎండిపోని నల్లగండి కూడా ఎండిపోయింది.

ఆ నల్లగండే ఎండిపోయిందంటే కరువు గురించి ఇంక చెప్పేదేముంది?!

వానచినుకు ఎరక్క నాలుగేళ్ళైతుంది.

శిరంశెట్టి కాంతారావు

చెర్లోరేగడి మట్టి నెర్రెలు గొట్టి, నడుస్తుంటే మడాలు దూరిపోతున్నాయి. ఆ నెర్రెల్లో అక్కడక్కడా మొలిచిన గంజేరు అలం బండి రోజాలంత వెడల్పున పెరిగింది.

చెరువు పడమర ఒడ్డును ఆనుకొని వున్న బజారు గుండా వెళితే, ఊరికి ఈశాన్యంగా చెరువు లోతట్టులో వున్న చెరువు బాయి వస్తుంది. ఆ బాయికి నాలుగు పక్కలా ఉన్న గిలకలు అరిగిపొయ్యి తోడుతుంటే 'కర్రు-కర్రు'మని ఫర్లాంగు దూరం విన్పిస్తుంది. ఎప్పుడు చూసినా బాయి మీద జనం గుంపులు, గుంపులుగా కన్పిస్తూనే ఉంటారు.

ఆ చెరువు బాయి పక్కనున్న మర్ల కింది నుండి వెళితే గంగ్రాయి, వల్లభి మీదుగా ఖమ్మానికి దగ్గరిదారి ఉంది.

పగలంతా రంపెకోత పనికి వెళ్ళొచ్చిన ఏలాద్రి అట్లొక్క కునుకు తీశాడో లేదా ఉలిక్కిపడి లేచి బిందె అందుకుని "ఏందే! నీల్లకు బొయ్యొస్తా!" అంటు పురిటి మంచం మీద వున్న భార్యతో చెప్పి చెరువు బాయికి బయలుదేరాడు.

ఏలాద్రికి నలభై ఏండ్లుంటాయి. బక్కగా నాసిన కోడిపెట్టలా ఉంటాడు. రెక్కల కష్టం, బజారు బత్తెం. కూలికిపోతే బుక్కెడు బువ్వ. లేకుంటే జాగారం కోట్లల్లో ఒకడు.

ఏలాద్రి చాకలి కుశాలు ఇంటి దగ్గరకు వెళ్ళేసరికి చెరువుబాయి గిలకల చప్పుడు కర్ణకఠోరంగా విన్పిస్తుంటే "ధూ.. ! ఈ ఊరికింత నీటెద్దడొస్తుందని కల్లోగూడా అనుకోలే" అనుకుంటూ చెరువు వైపు చూశాడు.



కరణం గారి ఇంటి కాణ్ణుండి దుమ్ము రేపుకుంటు రెండు లారీలు సర్రున దూసుకొచ్చాయి. వాటి వేగాన్ని జూసి "ఓర్నీ! మీదికెక్కుతాయా ఏందది!?" అనుకుంటు బిందెతో సహా ఎగిరి పక్కకు దూకాడు ఏలాద్రి.

ఆ లారీలు రెండూ చూస్తుండగానే కరణం వాళ్ళ ఇండ్లు దాటి, చెరువు బాయి మర్లు దాటి, మహంకాళి అప్పయ్యగారి మల్లెతోట దాటి, ఎర్రగొలవీలో నుంచి గంగ్రాయి రోడ్డెక్కాయి.

"ఏందల్లుడా! అంతగనం బయపడి దూకితివి?" జీవాల దగ్గర కాపలా కూర్చున్న యరదేశి అయ్యన్న అన్నాడు.

"సూడు మావా! ఆ లారీ నా కొడుకులు ఎంత సీడు మీదబోతున్నరో! అసలీ మధ్య ఈ లారీల గురించి, బాయినీల్లకు రావాల్నన్నా బయమైతుంది అసలేందీల్ల స్పీడు."

"నీకు తెల్వందేముందల్లుడా! ఈ కర్వుకి, జనం కూటికి జస్తున్నరని గవుర్మెంటోల్ళు కరువుపన్లకు బియ్యం బంపుతుంటే మద్యలో, దళారీలు జేరి దోసుకుతింటున్నారు. ఆ బియ్యం నేఉగబోతే పట్టుబడ్తయని ఇట్ల డొంకరోడ్లెమ్మటి సాటుగ ఖమ్మం గొడుతుంద్రు."

"నువ్వు జెప్పేది కరెట్టు మావా! ఏం పనిదొరక్క వారం రోజుల్నుంచి ఊకెనే చేతులు ముందలపెట్టుకుని కూచ్చుండే ఇయ్యాల్నే ఆ మోరే రామారావొచ్చి రంపెకోతకు పిలిస్తే పొయ్యొచ్చిన. ఇంట్లో మీ అమ్మాయేమో పచ్చి బాలింతాయె, పూటగడవడమే కనాకస్టమైతుంది."

"అదేగదా అల్లుడా! మొత్తుకునేది, ఈడజనం పనుల్లేక ఉప్పిడి, ఉపాసాలుంటుంటే... బుడ్డ, బుడ్డ లీడర్లు, కాంటాక్టర్లు, డీలర్లు ఏకమై... వచ్చిన బియ్యం వచ్చినట్టే అమ్మక నూకి జేబులు నింపుకుంటుంద్రు."

"ఔను మావా! నాకు తెలియకడుగుతా! ఇదంతా గవుర్మెంటోడికి, పోలీసులకి తెలియదంటవా!?"

"తెలియకుంట ఎట్లుంటది? నీ పిచ్చిగాని, ఎవళ్ళకు ముట్టేది ఆళ్ళకు ముడ్తుంటే ఇంకెందుకు మాట్లాడ్తరు."

"నిజమేలే మావా! అందరు దొంగలే. మనఖర్మే, ఇట్లగాలింది గాని పొయెస్తా. ఆ బాయిలగూడ నీల్లున్నయో, ఐపొయినయో" అన్నాడు పలాద్రి.

"మంచిదల్లుడా పొయిరా" అంటు జీవాల వైపు తిరిగి గూడ చాపమీద ఒరిగాడు యరదేశి అయ్యన్న.

* * *

రోజూ రాత్రిపూట లారీల్లో ఊరు దాటి పోతున్న కరువు బియ్యాన్ని చూసి, చూసి కడుపు మండిన ఊళ్ళో వాళ్ళు కొంతమంది చిల్లకల్లు స్టేషన్‌లో ఎస్సైతో" సార్! రోజు బియ్యం దొంగరవాణా ఐతున్నై" అంటు ఫిర్యాదు చేశారు.

'అవి కరువు బియ్యమని మీకెవరన్నా

చెప్పారా? మీరే అనుకుంటున్నారా? నిజంగా కరువు బియ్యం ఐనా డైరెక్ట్‌గా మేం జేసేదేముంది!? ముందు వెళ్లి ఎమ్.ఆర్.ఓ.కి చెప్పండి. ఆయన మాకేమైనా చెబితే అప్పుడొచ్చి చూస్తాం. ఐనా ఇదంతా మీకెందుకొచ్చిన గొడవ, ఎవడి బాధవాడిది. మధ్యలో మీ సొమ్మేంబాయె" కుర్చీలో కూర్చుని కాళ్ళాడిస్తు అన్నాడు ఎస్సై.

"మీరట్ల మాట్లాడితే ఇంక మేమేం జెప్తం సార్! అవి మాత్రం ఖచ్చింత కరువు బియ్యమే" అన్నారు అప్పటిదాకా మౌనంగా నిల్చున్న ఎర్ర లింగారావు, కోట కృష్ణలిద్దరు ఎస్సైతో.

"మీరిద్దరూ లీడర్లా ఏంటి? గట్టిగా మాట్లాడుతున్నారు" అన్నాడు ఎస్సై.

"ఉన్న సంగతి చెప్పడానికి లీడర్లేగావాల్నా సార్" అన్నాడు ఎర్ర లింగారావు.

"ఏయ్! మాటలు చాలుగాని, ఆ వక్కరూంలో రైటర్‌కి కంప్లయింట్ రాసిచ్చిపొండి" అసహనంగా కదులుతూ గట్టిగా ఆవులించి, నోటి ముందు చిటికలెయ్యసాగాడు ఎస్సై.

పోలీస్ స్టేషన్‌లో నుండి నేరుగా ఎమ్.ఆర్.ఒ. ఆఫీస్‌కి చేరుకుంటున్న ఊరి వాళ్ళకు మెయిన్ గేట్లోనే ఎదురైన ఆర్.ఐ. "ఏంటి కత!? ఊరోళ్ళంతా కట్టగట్టుకొని వస్తున్నారు" కనుకొలుకుల్లోనుండి అందరినీ పరిశీలిస్తూ అన్నాడు.

"ఏముంది సార్! ఎమ్.ఆర్.ఒ. గార్ని కలుద్దామని-" చెప్పాడు కోటకృష్ణ.

"పనేంటో!"

"ఏంలేదు సార్! ఓ పక్క ఊళ్ళో జనం కరువు పన్ను కూడా లెవ్వని చస్తుంటే.. ఇంకోపక్క కరువు పన్ల పేరుమీద వచ్చిన బియ్యం మాత్రం మా కళ్ళముందే లారీలకు, లారీలు ఊరుదాటి పోతున్నాయి. ఈ సంగతే సార్‌తో మాట్లాడ్దామని వస్తున్నాం" అన్నాడు పుట్టం పుల్లారావు.

"అదా విషయం... ఐతే, కలెక్టరాఫీస్‌లో పనుండి రాత్రే ఎమ్.ఆర్.ఓ. గారు బందరెళ్ళారు. ఇంకా నాల్రోజుల్దాకా రారు" అంటు మెల్లగా చెప్పాడు ఆర్.ఐ., ఊరు వాళ్ళు ఉస్సూరుమని పొయ్యేలా.

* * *

రాత్రి ఎనిమిది గంటలవుతున్నా పగలంతా కాచిన ఎండకు భూమిలో నుండి ఇంకా ఆవిర్లు వస్తునే ఉన్నాయి. ఏ చెట్టు మీద రెమ్మకూడా కదలకపోవడంతో మనుషుల శరీరాలన్నీ కుమ్ములో పెట్టిన దోసకాయల్లా మగ్గిపోతున్నాయి.

ఈశ్వరమ్మ స్తంభం గద్దెమీది నాపరాళ్ళూ కాలుతునే ఉన్నా ఎలాగోలా వాటి మీదనే సర్దుక్కూర్చున్నారు. ఊళ్ళో వాళ్ళు-

'నాలుగేండ్ల నుంచి వాన చినుకు ఎట్లుండదో తెలియదు. నీళ్ళకు, తిండికి జనం కట, కటలాడుతున్నారు. ఆ కరువు పన్లో, పాడో చేసుకుని పొట్టబోసుకుందామనుకున్నా ఆ పన్లు గూడా పొక్లైనర్లు, డోజర్లు పెట్టి చేయిస్తున్నారు. మరి, జనం బతికేదెట్ల?"

"గొడ్డోడు గొడ్డుకేడిస్తే... చియ్యోడు చియ్యకేడ్చిందన్నట్టు వానల్లేక, పంటల్లేక బతుకులు వల్లకాడై పోతుంటే వచ్చిన బియ్యం వచ్చినట్టే కాజేసి అమ్ముకుంటున్నారు. ఏదో ఒకటి చెయ్యకుంటే లాభం లేదు"

"ఈ రాత్రి చెరువు బాయి దిక్కుకెళ్లి, వచ్చిన లారీని వచ్చినట్టే మూసెయ్యాల్సిందే. అంతకు కేసులై జైలో, గియలో అంటే పోదాం. ఈ కరువు రోజుల్ల అక్కడున్న నాలుగు పప్పు చారు మెతుకులు దొరుకుతై"

"పోలీసోళ్ళు, ఎమ్.ఆర్.ఓ.లు బజార్ లీడర్లకు గూడా భయపడి మనం ఎన్ని జెప్పినా పట్టిచ్చుకోట్లేదు. ఏదైతే అదైంది గాని ఏదో ఒకటి చెయ్యాల్సిందే..." అంటు ఎవరికి తోచింది వాళ్ళు మాట్లాడసాగారు.

"సరే! ఏమన్నాగానీ లారీల్ని ఈ రాత్రే ఆపుదాం. అప్పుడన్నా విషయం పై వాళ్ళకు తెలిసి ఏమన్నా చర్యలు తీసుకుంటారేమో చూద్దాం" అంటు ఆ సమావేశం ముగిసినట్టుగా లేచాడు రేగళ్ళ

వెంకటేశ్వర్లు.

* * *

రాత్రి రెండు గంటలు...

అనుకున్న ప్రకారం ఊరి జనం పంచాయితీ ఆఫీస్ అరుగుల మీద, సాలె బజార్లో ఎండిపోయిన వంగుడుబాయి దిమ్మెల మీద, కరణం గారి అరుగుల మీద, చెరువుబాయి మర్లకింద గుంపులు, గుంపులుగా చేరి లారీల కోసం ఎదురు చూడసాగారు.

అదుగో అప్పుడు జగ్గయ్యపేట అడ్డదారి గుండా వచ్చిన లారీలు రెండు మెల్లగా మెయిన్‌రోడ్డు దాటి పంచాయతీ ఆఫీస్ ముందునుంచి, సాలెబజార్ దిగుడుబాయి మీదుగా పోతూనే వున్నాయి. లారీలను ముందుకు మిగిలనిచ్చి వెనుక నుండి ఒక్కసారిగా లేచిన జనం అరుపులు, కేకలతో వాటి వెనుక పరుగెత్తసాగారు.

ఆ అరుపులను విన్న కరణంగారి అరుగుల మీద జనం గోలగోలగా దిగ్గున లేచి నిల్చున్నారు.

"ఇక్కడేదో జరగబోతుంది" అనుకున్న లారీల్లో వాళ్ళు మరింత వేగంగా లారీలను తోలసాగారు. వాటికి అడ్డం రాబోయిన జనం దెబ్బకు భయపడి రాతిమీద కొట్టిన చిల్లపెంకుల్లా చెల్లాచెదరై అరవసాగారు. ఇదంతా గమనించిన చెరువుబాయి మర్లకింద వున్న వాళ్ళు వెంటనే దారి కడ్డంగా ఎడ్లబండ్లను తోసేశారు.

దూకుడుగా వచ్చిన లారీలు సడన్ బ్రేకులతో 'క్రీచ్' మంటూ బండ్లను తాకుతు ఆగిపొయ్యాయి. మరునిమిషంలో జనం రెండు వైపుల్నుండి లారీలను చుట్టుముట్టారు.

జరుగుతున్న సంఘటనలకు దిమ్మెరపోయిన లారీల్లో వాళ్ళు అంతమంది జనాన్ని చూసి భయం, భయంగా దిగి, పైకి మాత్రం బింకంగా "ఏంటిదంత? మా బండ్లెందుకాపుతున్నారు?" అడిగారు.

"జనం కోసం గవర్నమెంట్ పంపిస్తున్న కరువు బియ్యం మీరెక్కడికి తోలుకుపోతున్నారో ముందసలది చెప్పండి" అడిగాడు టైలర్ జానిమియా గుంపులో నుండి ముందుకొస్తు.

"ఇవి దొంగ బియ్యమని ఎవరు చెప్పారు? బాజాప్తుగా కాయితాలతో కొనుక్కుపోతున్న బియ్యం, ఐనా, మేమేమన్న మీ ఇండ్లల్లో నుండి ఎత్తుకుపోతున్నామా?" భయంవల్లనో, కోపం వల్లనో గొంతు జీరబోతుంటే అన్నాడు లారీల్లో నుండి దిగిన వాళ్ళల్లో ఒకడు.

"అంతా పక్కా కాయితాలున్నాయేం, చూపించండోసారి" అడిగాడు కోటకృష్ణ.

"మీరెవరయా కాయితాలడగడానికి!? మీకువెందుకు చూపించాలి? మీరేమన్న ఆఫీసర్లా?"

"ఓహో! ఆఫీసర్లయితేనే చూపిస్తారా! కరువుకి జనం తిండికి అల్లాడుతుంటే మీరేమో వచ్చిన బియ్యం కాస్తా ఇట్లా దొంగ రవాణా చేసి వేలకు, వేలు సంపాదిస్తారు. అదేమని అడిగితే ఆఫీసర్లా? గోంగూరా? అంటు లాపాయింట్లు తీస్తున్నారేంటి!?" గట్టిగా దబాయించాడు కొల్లి బ్రహ్మం.

చూడబోతే పరిస్థితంతా ఏదోలా మీరేలా ఉందని భావించిన లారీల వాళ్ళు వెంటనే కాళ్ళ బేరానికొస్తూ "ఇదంతా ఎందుగ్గాని, ఇందుగో! ఈ ఐదువేలుంచుకుని మీ దారిన మిమ్మల్ని వెళ్ళనివ్వండి" అంటు డబ్బులు తియ్యసాగాడు వాళ్లల్లో ఒకడు.

"అంటే ఊరోళ్ళందరికి లంచమిస్తున్నారా?" అన్నాడు ఎర్రలింగారావు.

"-----"

"య్యాహాఁ నాలుగెయ్యండి నా కొడుకుల్ని, డబ్బుల్తో కొనాలని చూస్తున్నారు గాని" జనంలో నుండి ఎవరో గట్టిగా అరిచారు.

దాంతో చెదిరిపోయిన లారీ వాళ్ళు "ఇంతకూ మీరనేదేంటి? మీకు మాత్రం కాయితాలు చూపించే ప్రసక్తే లేదు. కావాలంటే పోలీసులకి చెప్పుకుంటారో, ఎమ్.ఆర్.ఓ.కి చెప్పుకుంటారో చెప్పుకోండి మీ ఇష్టం" తెగించినట్టుగా మాట్లాడాడు లారీల వాళ్ళల్లో ఒకడు.

"ఎవరితోనో చెప్పుకుంటాంగాని, ముందు బండ్లు తీసుకుపొయ్యి పంచాయితాఫీస్‌లో పెట్టండి" అన్నాడు కోటకృష్ణ.

డ్రైవర్లు లారీలను రివర్స్ చేశారు. లారీల్లో ఉన్న వాళ్ళల్లో ఒకడు సెల్‌ఫోన్ తీసి ఎవరితో మాట్లాడుతూ "అలాగే, అలాగే" అనసాగాడు.

వస్తున్న లారీలు, సాలె బజార్

(మిగతా 15వ పేజీలో)

ద్వేషంతో కాదు, ప్రేమతో గెలవాలి

అంపశయ్య నవీన్

“ఏమోయ్ సుదర్శనం! నీ దర్శనం బొత్తిగా లేదు. ఏమైపోయావ్?”

“ఏమీ కాలేదు సార్! నా జీవితమే అయోమయమై పోయింది....”

“ఏమైందినీ జీవితానికిప్పుడు?”

“పెండ్లి చేసుకోవడం నేను చేసిన పెద్ద పొరపాటు... ఈ పెండ్లి, ఈ పెళ్ళాం అనేవి నాకో గుదిబండలా తయారయ్యాయి...”

“పెళ్ళి చేసుకోని వాడేమో ఎప్పుడు చేసుకుందామా అని ఉబలాటపడ్తాడట. చేసుకున్న వాడేమో ఎందుకు చేసుకున్నానా అని గుండెలు బాదుకుంటాడట...”

“మీరిట్లాంటి సామెతలు బాగానే చెబుతారులెండి -కానీ సామెతలతో నా కష్టాలు తీరవుకదా...” “నీ కష్టాలేమిటో చెప్పు... తీర్చటానికి ప్రయత్నిస్తాను...”

“నా పెళ్ళామే నాకో పెద్ద కష్టమైపోయింది.”

“మొగుడికి పెళ్ళాం, పెళ్ళాం మొగుడికి కష్టాలుగా మారిపోవడం చాలా కాలంగా ఉన్నదేగానీ అసలు విషయమేమిటో చెప్పు.”

“నా పెళ్ళాం నన్ను అనుక్షణం రాచిరంపాన పెడుతున్నది సార్... పరిస్థితి ఎంత దారుణంగా మారిపోయిందంటే ఆత్మహత్య చేసుకొని ఈ లోకానికి గుడ్‌బై చెప్పేద్దామా అని ఆలోచిస్తున్నాను.”

“ఛఛ! ఆత్మహత్య చేసుకోవడం సమస్యకు పరిష్కారం కానేకాదు. ఈ మధ్య చాలా మంది... ముఖ్యంగా మనకింత అన్నం పెట్టే రైతులు నీలాగే ఆలోచిస్తున్నట్టుంది. అందుకే రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. కష్టాలొస్తే వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలే గానీ చనిపోకూడదు..”

“మీరలాగే చెబుతారులెండి. ఆ కష్టాలు మీకొస్తే తెలుస్తుంది ఆ బాధేమిటో...”

“నేనూ చాలా కష్టాలు అనుభవించిన వాడినేగానీ, అసలు నీకూ, నీ భార్యకు మధ్య ఏ విషయంలో గొడవలొస్తున్నాయో చెప్పు...”

“ఏ విషయంలో గొడవలు రావడం లేదని అడగండి. ఆమెతో నేను గొడవపడని విషయమంటూ లేదు.”

“ఉదాహరణకొకటి చెప్పు...”

“డబ్బులు మంచినీళ్ళలా ఖర్చు పెట్టేస్తుంది. తెచ్చిపెడుతుంటే తినికూర్చుంటూ డబ్బులన్నీ పాడు చేస్తున్నావని నేనంటే నేను తిని కూర్చుంటున్నానా అని గొడవ చేస్తుంది.’

“దేని మీద ఖర్చు పెట్టేస్తుంటుంది?” “నెల తిరక్కుండానే గ్యాసయిపోయిందంటుంది. నెలకో సిలండర్ తెమ్మంటే నేనెలా తెచ్చేది. నేను చేసేది టీచరుద్యోగం...”

“గ్యాసయిపోతే ఆమేం చేస్తుందని..”

“పొదుపుగా వాడుకోవచ్చు కదా...”

“పొదుపుగా వాడుకోకుండా ఏం చేస్తున్నది... నీకు, నీ పిల్లలకూ వండిపెట్టాలిగదా...”

“ఔనండి!.. వండి పెట్టాలి. కానీ వేడినీళ్ళక్కూడా గ్యాసే వాడాలా?”

“నువ్వు స్నానం చన్నీళ్ళతో చెయ్యడానికి రెడీయా?”

“చన్నీళ్ళతో ఎలా చేస్తాను. వేడినీళ్ళకు అలవాటు పడేలా చేసింది కదా...”

“అదీ ఆమె తప్పే అంటావా?”

“అవును.. ఇదివరకు నేను చన్నీళ్ళతోటే స్నానం చేసేవాడిని.. కట్టెలపొయ్యితోటే వంట చేసుకునే వాడిని. ఈమెను చేసుకున్నాకే గ్యాసు పొయ్యొచ్చింది. వేన్నీళ్ళొచ్చాయి. తను వేడినీళ్ళతో తప్ప చన్నీళ్ళతో స్నానం చెయ్యదుట. అందుకని నాకూ వేన్నీళ్ళే అలవాటు చేసింది. నాకు వేన్నీళ్ళొద్దు.... చన్నీళ్ళతో చేస్తానంటే వినదు.. రోజూ పెద్ద రభస...”

“ఇంకా ఏ విషయంలో మీరు గొడవపడుతుంటారు?”

“నెలకు వెయ్యి రూపాయల కరెంట్ బిల్లు వస్తుంది. ఆదా చేసుకోమంటే వినదు...”

“కరెంటు రేట్లు పెరిగిపోయాయి కదా... అందరికీ అలాగే వస్తున్నది. దీని గురించి గొడవ పడటమేమిటి?”

“కరెంటు రేట్లు పెరిగినప్పుడు కరెంట్ వాడకాన్ని తగ్గించుకోవాలి కదా.. 24 గంటలూ టీవీ చూస్తూ ఉండిపోవాలా? టీవీలో వచ్చే ప్రతీ చెత్త ప్రోగ్రాం., చెత్త సీరియల్ చూడాలా.. నేనైతే రోజూ ఓ గంట సేపు కూడా టీవీ చూడను. నేనసలు ఇంట్లో ఉండేదే తక్కువ.”

“అవును మరి... నువ్వు ఇంట్లో ఉండవు... పిల్లలు స్కూలు కెడ్తారు.. ఆమెకు టైమెలా గడుస్తుంది?”

“ఇంట్లో బోల్డు పనుంటుంది. నెలకు వందరూపాయలిచ్చి పనిమనిషినెందుకు పెట్టుకోవాలి? ఎప్పుడూ ఆ టీవీ చూడలేకపోతే ఏం అంటే ఈ టీవీని మా నాన్నగారు కొనిచ్చారు కాబట్టి నేనిలాగే చూస్తాను అంటుంది. టీవీ కొనిచ్చాడు కదా... కరెంటు బిల్లులను కూడా మీ నాన్ననే కట్టమను అని నేనంటాను. అంతే అదో పెద్ద గొడవకు దారి తీస్తుంది. నేనో మాటంటే ఆమొకటంటుంది. మాటకు మాటంటావా? మొగడంటే నీకు బొత్తిగా భయం లేదని నేనోటి అంటిస్తాను...”

“అంటించడం కూడా చేస్తుంటావా?”

“నూటి పోటి మాటల్తో నా బీపీని పెంచుతుంది. మీకు తెలియదు సార్... ఈ ఆడవాళ్ళు మన సహనానికి పరీక్ష పెడ్తుంటారు. మనల్ని విపరీతంగా రెచ్చగొడ్తుంటారు. మన అహం మీద దెబ్బకొడుతుంటారు...”

“నువ్వు మాత్రం ఆమె సహనాన్ని పరీక్షించడం లేదూ? ఆమె అహం మీద దెబ్బకొట్టడం లేదూ?..”

“నేను మొగవాన్ని... భర్తను. నేనేం చేసినా చెల్లుతుంది. ఆఫ్టరాల్ ఓ ఆడది. నేను కష్టపడి పని చేసి ఇంతతెస్తే తిని ఇంట్లో కూర్చునేది... నేను ఏ మాటంటే నన్నూ అదే మాటంటుందా ?

“ఆఫ్టరాల్ ఆడది!” అన్న నీ మాటతో నీ తప్పుడు మనస్తత్వం అర్థమైపోయింది. నీ కష్టాలన్నింటికీ నీ ఈ తప్పుడు మనస్తత్వమే కారణం.”

“అంటే ఏమిటి మీ ఉద్దేశం?”

“స్త్రీ పురుషుడి కంటే తక్కువ అనే తరతరాల పురుషాధిక్య భావం నీలో కరుడుగొట్టుకొని పోయింది. కానీ ఇటీవలి కాలంలో చాలా మంది పురుషుల్లో స్త్రీ మనకన్నా తక్కువ అనే భావం పోతున్నది.. నీలాంటి కొందరు మూర్ఖులు మాత్రం ఇంకా మారడం లేదు...”

“మీరేమన్నా చెప్పండి సార్! ఈ స్త్రీలు సామాన్యులు కారు. వాళ్ళకు మనం కొంచెం అలుసిస్తే చాలు మననెత్తి మీదికెక్కి కూర్చుంటారు. నా తరఫు వాళ్ళొస్తే ఒకలాగ చూస్తుంది. వాళ్ళకింత తిండి పెట్టడమే దండగనుకుంటుంది. అదే ఆమె తరఫు వాళ్ళొస్తే పంచభక్ష్య పరమానాలు వడ్డిస్తుంది. ఇట్లా ఎందుకు చేస్తున్నావని అడిగితే గొడవ.. ఏడుపులు, పెడబొబ్బలు. మనల్ని లొంగదీసుకోవాలని చూస్తారు. నేనలా లొంగిపోయేవాడిని కాదని రుజువు చెయ్యడానికి ఆమె ఏడుస్తున్న కొద్దీ నాకింకా ఏడిపించాలనిపిస్తుంది. పిసినారోడు. పిల్లిక్కూడా ఓ ముద్ద పెట్టడు నాకో హీరోహోండా కొనిపెడతానన్నాడు, కొనిపెట్టాడా యెగ్గొటేశాడు. వాడో దౌర్భాగ్యుడు. వాడో దగాకోరు అంటూ తిడ్తాను. అంతే... ఆవిడ రెచ్చిపోతుంది. ఇష్టమొచ్చినట్టు వాగుతుంది. నేనామెను పిడిగుద్దులు గుద్దుతాను.

“నీ జీవితాన్ని నువ్వే నీ చేజేతులా నరకం చేసుకుంటున్నావు. మొట్టమొదలు స్త్రీలు, పురుషుల తక్కువ అనే నీ మనస్తత్వాన్ని మార్చుకోవాలి. స్త్రీలను తిట్లతో కాదు ప్రేమతో గెలవాలి. ప్రేమించే వాడికి స్త్రీలు తమ ప్రాణమిస్తారు. స్త్రీలల్లో అనేక కారణాల వల్ల అభద్రతా భావం ఎక్కువగా ఉంటుంది. దాన్ని భర్త ప్రేమతో పోగొట్టాలి. భర్త తన ప్రేమతో ఆమె తన తల్లిదండ్రుల్ని మరచిపోయేలా చెయ్యాలి. అప్పుడే నువ్వూ ఆమె సుఖంగా ఉండగలుగుతారు.” ❖

రావూరి రమాదేవి

సమయస్ఫూర్తి

పూర్వం శంభునందుడనే గురువుగారున్నారు. ఆయన ధర్మ ప్రచారం చేస్తూ గ్రామాలు పర్యటిస్తుంటారు. ఆయన దగ్గర శంకరయ్య అనే శిష్యుడు వుండేవాడు. అతను కాస్త అమాయకుడే కాదు. సమయస్ఫూర్తి లేని వాడు కూడా. గురువుగారు ఓ రోజు అడవి గుండా నడిచిపోతున్నారు. శిష్యుడు తన సందేహాలు అడిగి తీర్చుకుంటూ వెనకాలే వెళ్తున్నాడు. వాళ్లిద్దర్నీ దొంగలు అడ్డగించి, "మీ దగ్గర వున్నదంతా ఇక్కడ పెట్టి వెళ్లండి" అన్నారు.

"మా దగ్గర ఏమున్నాయి నాయనా? దేశాటన చేస్తూ ధర్మ ప్రబోధం చేసేవాళ్లం. గ్రామస్తులు ఇచ్చిన తృణమో, ఫణమో గ్రహించి పొట్ట పోసుకునేవాళ్లం" అన్నాడు గురువు.

"మాకివాళ ఏమీ దొరకలేదు. ఏదో ఒకటి ఇవ్వందే మిమ్మల్ని వదిలిపెట్టం. మీ ఇళ్ల దగ్గర ఎంతో కొంత ధనముంటుంది కదా! అది తీసుకురండి. అప్పటిదాకా మిమ్మల్ని వదిలేది లేదు" అని గురువును చెట్టుకు కట్టేశారు.

"నువ్వు చందనగిరిలోని ఇంటికెళ్లి వున్న డబ్బంతా తీసుకురా" అన్నాడు శిష్యునితో.

"బంగారం కూడానా?" అన్నాడు శిష్యుడు.

"సరే. బంగారం కూడా ఎంత వుంటే అంతా తీసుకురా..." అన్నాడు గురువు.

"బంగారం అక్కడ్నుంచి తేవడమెందుకు గురువుగారూ! మీకు బంగారం చేయడం వచ్చుగదా. ఎంతో కొంత చేసి వీళ్లకివ్వండి. వెళ్లిపోదాం" అన్నాడు.

గురువుగారి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయ్యింది. 'వీళ్లిక బంగారం చేసి ఇవ్వందే వదిలిపెట్టరు. వీడికి నా విద్య గురించి చెప్పడం పొరపాటైంది' అని మనసులోనే విచారించాడు.

"బంగారం చేసే విద్య వచ్చి కూడా, మాకే టోకరా ఇస్తావా? ఇప్పుడు మాకు బంగారాన్ని తయారు చేసివ్వు. లేదా మీ ఇద్దర్నీ చంపేస్తాం" అన్నారు దొంగలు.

"నిజమే నాయనలారా! కానీ అది ఎప్పుడు పడితే అప్పుడు తయారు చేయడం సాధ్యం కాదు. పున్నమి రోజు మాత్రమే చేయడం కుదురుతుంది. అది కూడా రాజుగారి దగ్గరున్న 'మణి'తోనే సాధ్యమవుతుంది. దాన్ని తెచ్చి వెన్నెల్లో పెట్టి మంత్రాలు చదవాలి. ఆ మణి కిరణాలు ఏ లోహం గుండా ప్రయాణిస్తాయో అది కాస్తా బంగారం అవుతుంది. ప్రస్తుతం ఆ మణి మన రాజు కరుణసాగరుడి వద్ద మాత్రమే వుంది. వెళ్లి తీసుకురండి" అన్నాడు గురువు.

"మేమెలా వెళ్లగలం? పట్టుకుని జైల్లో పెడతారు. కాబట్టి నువ్వే ఒక లేఖ రాసి, నీ శిష్యుడికి ఇచ్చి పంపు. మా గురించి ఏమన్నా చెప్పావో అన్యాయంగా నీ ప్రాణాలిక్కడే పోతాయి. కేవలం మణిని మాత్రమే పంపేలా రాయి. కేవలం నీ కోసమని..." అన్నాడు దొంగల నాయకుడు.

'సరే' అని ఒక తాటాకు తెప్పించి, ముల్లుతో సంస్కృతంలో సంక్షిప్తంగా తన స్థితిని వివరిస్తూ రాశాడు. శిష్యుడు దాన్ని తీసుకెళ్లి రాజుకి అందచేశాడు. చదివి గురువు స్థితిని అర్థం చేసుకున్నాడు రాజు. మణిలాగే వున్న రాయిని శిష్యుని చేతిలో పెట్టాడు. దాన్ని తీసుకుని శిష్యుడు వెనుదిరిగాడు. అతనికి తెలియకుండా ఆరుగురు మెరికల్లాంటి సైనికుల్ని మారువేషాల్లో వెనకాలే పంపాడు. శిష్యుడు యధావిధిగా వెళ్లి, మణిని గురువు చేతిలో పెట్టాడు. దొంగలు ఆ రాయిని లాక్కొని పరీక్ష చేయసాగారు. అదే అదునుగా భావించిన సైనికులు హఠాత్తుగా దొంగల మీద పడి బంధించారు. తర్వాత గురువుగారిని విడిపించారు.

ఆ తర్వాత గురుశిష్యులిద్దరూ ఇల్లు చేరుకున్నారు. ఆయన శిష్యునితో, "నాయనా! నీకు శిష్యుడికుండాల్సిన వినయం, విధేయత, విశ్వాసం అన్నీ వున్నాయి. కానీ సమయస్ఫూర్తి లేదు. ఈ ఒక్కటీ లేకుండా మిగతావి ఎన్ని వున్నా వ్యర్థమే. ఈ సంఘటన నుంచి గుణపాఠం నేర్చుకోక పోతే నీ బతుకు భారమవుతుంది సుమా" అని హితబోధ చేశారు. అప్పటికే శిష్యుడిలోనూ ఆలోచన ప్రారంభమైంది. సమయానుకూలంగా మెలిగి సమస్యలనుంచి బయటపడాలన్న విషయం అతనికి అర్థమైంది.



చిన్నారి చిత్రకారులు

వి.సౌమ్య,
5వ తరగతి, ఈమని.

కె.సింధూర, 4వ తరగతి,
నలంద విద్యాలయం,
మహబూబ్‌నగర్.

టి.వి.వి.యస్.కిరణ్‌బాబు, 4వ తరగతి,
కేంద్రీయవిద్యాలయము, ఉక్కునగరం.

ఈ వారపు ఉత్తమ చిత్రం



పి.సందీప్, 8వ తరగతి, లిటిల్ బడ్స్ హైస్కూల్, హయత్‌నగర్, హైదరాబాదు.

ఆర్.రవితేజ,
8వ తరగతి, లిటిల్ బడ్స్ హైస్కూల్, హయత్‌నగర్, హైదరాబాదు.

వి'చిత్రం'

ఆహా! ఏమి కట్టడం!!

నేస్తాలూ! పైన ఓ బొమ్మ వుందికదా. మధ్యలో చెయ్యిపెట్టి.. కింద నుంచి చూస్తేనేమో ఖాళీ స్థలం చుట్టూ అందమైన పిట్టగోడ కట్టినట్టు వుంది. అదే పైనుంచి చూస్తేనేమో ఆకాశహర్మ్యంపైన కొందరు పని చేస్తున్నట్టుంది. ఇంకొందరు పైనుంచి నిచ్చెన సాయంతో కిందకు దిగుతున్నట్టు కనిపిస్తుంది.

కానీ చిన్నారులూ.. నేలను, ఆకాశహర్మ్యపు పైభాగాన్ని కలిపి ఒకటిగా బొమ్మ వేసిన చిత్రకారుని అభినందించాల్సిందేకదూ. మరి ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా చప్పట్లు చరుద్దామా!

రంగులు అద్దుదాం రండి!



మేం పక్షులం

WOCKOEREDP	
TUULERV	
CAONUT	
SWLALWO	
CAEPOKC	
WORC	

ఇంగ్లీషు పజిల్-2

హాయ్ పిడుగులూ! పైన కొన్ని గడులు, పక్కన కొన్ని పదాలు వున్నాయి. కాకపోతే అక్షరాలు అటూ ఇటూ మారాయి. వాటిలోనే కొన్ని పక్షుల పేర్లు దాగి వున్నాయి. వాటిని సరిచేసి మేం ఇచ్చిన గళ్లలో వాటిని నింపాలి. అంతటితో మీ పని అయిపోదు. వాటిని ఓ కార్డుమీద రాసి మాకు పంపాలి. అన్నీ సరిగ్గా వుంటే మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. సరేనా! మరి మా చిరునామా: **ఇంగ్లీషు పజిల్, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.**

పజిల్-1 సమాధానం

'L' తో మొదలయ్యే ఎనిమిది పదాలు

Lacerate, lifeless, linger, lollipop, lizard, ladder, logic, labyrinth. ఇవేకాక చిన్న చిన్న పదాలు చాలా రాయవచ్చు.

July విలువ ఎంత?

నేస్తాలూ! ఇవాళ మిమ్మల్ని అడిగే ప్రశ్నకు జవాబు చెప్తే మీకు చాలా తెలివితేటలున్నట్టు. march నెల విలువ 43. may విలువ 39. అయిన july విలువ ఎంత?

'ఈ నెలల విలువేంట్రా బాబూ!' అనుకుంటున్నారా? అయితే ఒక చిన్ని క్లూ ఇస్తాం. ఆంగ్ల వర్ణమాలలో ఎన్ని అక్షరాలున్నాయి? 26. అవునా a అంటే 1. b అంటే 2. సి అంటే 3. ఇలా ప్రతి అక్షరానికి విలువలు వేసుకోండి. తర్వాత july విలువ తెలుసుకోండే. సరైన జవాబు తెలియాలంటే వచ్చేవారం వరకు ఆగాల్సిందే.

పులితోలు-గాడిద

హరిపురం అనే ఊరిలో ఒక రజకుడున్నాడు. అతడు పరమ లోభి. డబ్బు ఖర్చు కాకుండా గాడిదను పెంచడానికి ఒక ఉపాయాన్ని ఆలోచించాడు. ఆ ప్రకారం ఒక పులి తోలు తెచ్చి గాడిదకు కప్పి పంట చేలోకి వదిలేవాడు. గాడిద హాయిగా పండిన పంటను మేసేది. రైతు అది నిజమైన పులి అనుకొని భయపడి పారిపోయేవాడు. ఎద్దులు పలుపుతాళ్లు తెంచుకుని పరుగులు తీసేవి.

పంటను నాశనం చేస్తున్న మాయ పులిని చూసి రైతు తెగ బాధప ి ఎడు. చివరకి ఎలాగైనా దాని పీడ వదిలించుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఒకరోజు రాత్రి బూడిద రంగు దుప్పటి కప్పుకుని విల్లంబును పట్టుకుని ఒక చెట్టు చాటున మాటువేశాడు. కాసేపటికి పులి తోలు కప్పుకున్న గాడిద పొలంలోకి ప్రవేశించింది. బూడిదరంగు దుప్పటి కప్పుకున్న రైతుని చూసి మరొక గాడిద వచ్చిందనుకుంది. 'ఇన్నాళ్లకు ఒక జతగాడు దొరికాడు' అనుకుని సంతోషించింది. ఆ సంతోషంలో ఓండ్ర పెట్టింది.

దాని అరుపు విని రైతు ఆశ్చర్యపోయాడు. "ఎంత మోసం చేసింది ఈ మాయదారి గాడిద?" అనుకుంటూ కోపంతో బాణం వేసి దాన్ని చంపేశాడు.

"నోరు కట్టుకోలేక గాడిద ప్రాణం పోగొట్టుకుంది. కనుక ఎవరికైనా నోటి దురద వుండకూడదు. క్షేమంగా వుండాలనుకునే వాడికి వినయ విధేయతలు వుండాలి. అంతేగానీ నా అంతటివాడు లేడని మిడిసిపడకూడదు. దీర్ఘముఖా! తర్వాతేం జరిగిందో చెప్పు" అన్నాడు హిరణ్యగర్భుడు.

దీర్ఘముఖుడు చెప్పసాగాడు. "నన్ను పొడవడానికి వచ్చిన పక్షులతో నేను యుద్ధానికి సిద్ధమయ్యాను. అప్పుడు ఆ పక్షులు "ఓరి ద్రోహీ! తిన్న ఇంటి వాసాలు లెక్కపెడతావా? మా ఆదరాన్ని పొంది మమ్మల్నే నిందిస్తావా? నీ నోటి దురుసుకు తగిన ఫలితం అనుభవించు" అంటూ నన్ను ముక్కులతో పొడిచి, గోళ్లతో రక్కేశాయి.

అప్పుడు ఒక పక్షి "ఓరీ! మీ రాజు మెత్తనివాడు. బలహీనుడు. అతనికి రాజ్యపాలన చేసే అర్హత లేదు. అలాంటి రాజును కొలిచి నువ్వేం సుఖపడతావు? అలాంటి రాజు దగ్గరకు రమ్మని మాకు దుర్బోధ చేయడానికి సాహసిస్తావా? ఆశ్రయిస్తే మంచి పండ్ల చెట్టునే ఆశ్రయించాలి. ఒక్కోసారి దాని పళ్లు దొరక్కపోయినా, దాని నీడైనా దొరుకుతుంది. గొప్పవారితో వుంటే నీచునికి సైతం గౌరవం లభిస్తుంది. నీచులను ఆశ్రయిస్తే వున్న గౌరవం కూడా పోతుంది. కల్లు అమ్మేవాడి దగ్గర పాలముంత వున్నా అందరూ అది కల్లు అనుకుంటారు. నీచులతో స్నేహం చేసిన వారు కష్టాలపాలవుతారు. చివరికి మరణం కూడా సంభవిస్తుంది. అల్పుని సేవించటం కన్నా గొప్పవానిని సేవించటం మేలు. ప్రభువు సమర్థుడైతే అతని పేరు చెప్పుకున్నంతనే పనులు నెరవేరతాయి. అలా చంద్రుని పేరు చెప్పుకొని కొన్ని కుందేళ్లు ఏనుగుల్ని జయించాయి" అంటూ కథ చెప్పడం ప్రారంభించాడు దీర్ఘముఖుడు. ✪

పంచతంత్ర కథలు

అది సర్కస్ గుడారం. 'సర్కస్ మొదలవుతోందహో' అని తెలియజెప్పే ఫోకస్ లైటింగ్ కేరళలోని 'పలక్కాడ్' పట్టణంపై మూడు సార్లు తిరిగింది. గుండ్రటి ఎరీనా చుట్టూ వందలాది ప్రేక్షకులు టిక్కెట్ల తరగతుల వారీగా కూర్చున్నారు. రకరకాల జంతువుల చేత ఎన్నో రకాల ఫీట్లు చేయిస్తుంటే వినోదంగా చూస్తున్నారు. ఏడేళ్ళ వయస్సు పిల్లల్నుండి యాభై ఏళ్ళపై బడ్డ యువతులు "అసలు శరీరంలో ఎముకలున్నాయా" అన్నంతగా అబ్బురపరుస్తున్నారు.

వినోదం మాటున విషాదం

త్రినేత్రుడు

"అదిగో... నా బేటీ లక్ష్మీ" ఒక్కుదుటన లేచింది బిష్ణూమాయా. ఆమె నేపాల్ నుంచి వచ్చి ఆ సర్కస్ చూడ్డానికొచ్చింది.

నేపాలీ బాలిక లక్ష్మీ, సర్కస్ వాళ్ళు పెట్టిన మారు పేరుతో ఎనౌన్స్ చేశాక ఫోకస్ లైటింగ్‌తో పాటు వచ్చి "రోప్‌ఫీట్" చేస్తోంది. సర్కస్ చేస్తున్న ప్రతీ ఆడపిల్ల మీద, ప్రతీ యువకుడి మీద చూపు వేసి చూస్తోంది బిష్ణూమాయ. వాళ్ళలో తన కొడుకు రాజకుమార్, తన కూతురు లక్ష్మీ కనబడుతుందేమోనని ఆతృతగా చూస్తోంది. అసలందుకే వచ్చింది. కాదు.. ఆ నేపాలీ పెద్దాయనే తన వెంట తెచ్చుకొచ్చాడు.

"ఆ పిల్లే నా లక్ష్మీ" అంటూ గగ్గోలుగా తను కూర్చున్న కుర్చీల్లోంచి లేచి వరుసల్ని దాటుకుంటూ ఎరీనాలోకి పోయింది. సర్కస్ మ్యాజిక్ ఆగిపోయింది.

తన పళ్ళతో ఓ పహిల్వాన్ పట్టిన తాడుని లక్ష్మీ తన పళ్ళతో పట్టి గిరగిరా తిరిగే విన్యాసం చేస్తోంది. తల్లి గొంతు వినబడింది. లక్ష్మీలో తప్పుతున్న ఎటెన్షన్ గమనించాడేమో... పహిల్వాన్ ఆ ఐటమ్ ముగించి నెమ్మదిగా దించాడు. లక్ష్మీ వెంటనే తన తల్లిని లాక్కుని లోపలికి వెళ్ళిపోయి సర్కస్‌కి అంతరాయం లేకుండా చేసింది. లేకపోతే సర్కస్ రింగ్ మాస్టర్‌తో కొరడా దెబ్బలు తినేదే. తన టెంట్‌దగ్గరకు తల్లినీ ఆమె వెంట వచ్చిన వారినీ తీసుకెళ్ళింది.

ఈ ఎలక్ట్రానిక్ యుగంలో వినోదం, దానికి సంబంధించిన పరిశ్రమ సాంకేతిక అభివృద్ధి అందలాలనెక్కింది. ఈ నెట్ యుగపు విహార వినోద ఉల్లాసాల తీరుల్లో, పొందుటలో పెనుమార్పులు వచ్చాయి. ఆ మార్పులకేమీ చలించనంత ధ్వజస్తంభంలాగా ఈ 'సర్కస్ వినోద కార్యక్రమం' మాత్రం ఉండిపోయింది.

చిన్నిచిన్న బాలబాలికలను ఈ సర్కస్‌లలో బాల కదార్మికులుగా వినియోగిస్తున్నారు. అతివల సర్కస్ ఫీట్లతో పాటు వారి అందచందాలను కూడా సర్కస్ ఎరినాపై పరుస్తున్నారు. ఈ సర్కస్‌లో వినోదాన్ని అమ్మి డబ్బు గడించాలి కదా.. మరందుకు బాలబాలికలకు, తెల్లటి శరీరాలు, అందమైన ముఖాలు గల వారికి బహు గిరాకీ! అలాంటి బాలబాలికలకు, యువతీ యువకులకు తరలింపు కేంద్రంగా నేపాల్‌లోని "మక్వాన్‌పూర్' పేరొందింది.

ఆ నేపాలీ అందాల యువతులు, బాలబాలికల సర్కస్ విన్యాసాలతో "ది గ్రేట్ ఇండియన్ సర్కస్" ప్రదర్శన జరుగుతోంది. ఆ రోజు ఏప్రిల్ 14వ తేదీ బుధవారం అయినా 'డేరా ఫుల్'గా సాగుతోంది. సరిగ్గా ఓ అప్రకటిత "రెయిడ్" ఆ సర్కస్ సంస్థపై జరిగింది. "నేపాల్ చైల్డ్ వెల్ఫేర్ ఫౌండేషన్"కు చెందిన ఇంద్రదహాల్, మన దేశానికి చెందిన "సౌత్ ఇండియా కోయిలేషన్ ఆన్ చైల్డ్ సర్వీట్యూడ్" సంస్థకు చెందిన మరో ముగ్గురు ప్రతినిధులు అకస్మాత్తుగా ఈ దాడిలాంటి సోదాను నిర్వహించారు.

ఆ రోజు కార్యక్రమం హడావుడిగా ముగిసింది. వీరు పిలిపించుకున్న పలక్కాడ్ పోలీసులు, ఎస్సై వచ్చారు. వారు, సర్కస్ యాజమాన్యపు కళ్ళసైగల కనుగుణంగా డ్యూటీ చేస్తున్నారు.

"చూడండి పిల్లలూ... మేమున్నాం... మీకేం భయం లేదు. మీరు మీమీ నేపాల్‌కి వెళ్ళిపోదామనుకుంటే... నాతో వచ్చేయండి. నేను ఈ పలక్కాడ్ కలెక్టర్ సంజీవ్ కౌశిక్ గారితో కూడా మాట్లాడాను" అన్నారు ఇంద్రదహాల్.

అంతే కట్టలు తెంచుకున్న నదిలా ఆయాటెంటుల్లో ఉన్న బాల, యువ కళాకారుల్లో చాలా మంది, "మేమొచ్చేస్తాం... ఇక్కడ రింగ్ మాస్టర్లతో కొరడా దెబ్బలు తింటూ ఇక్కడ బతకలేం. తల్లిదండ్రులు గుర్తొస్తుంటే సర్కస్ ఫీట్లు చేయలేకపోతున్నాం" అన్నారు.

"ఒకసారి నేను బైక్ మీద చేస్తున్న ఫీట్‌లో కిందపడిపోయి పళ్ళూడగొట్టుకున్నాను. అయినా సరే ఇప్పుడూ పళ్ళతో పట్టుకుని వేలాడుతూ గిరగిరా తిరిగే 'రోప్‌ఫీట్' చెయ్యాల్సి వస్తోంది" తన తల్లినానుకుని కూర్చున్న లక్ష్మీ అంది.

అంత డైరెక్టుగా గుదిగుచ్చి వాస్తవాలను ఆ సర్కస్ పిల్లలు చెబుతుంటే లంచాలు మేసిన రక్షకభటులు అక్కడుండలేక డ్యూటీ చేస్తున్న హడావుడి సాకుతో అటూ ఇటూ తిరుగుతూ ఉన్నారు.

ఇంతలో జిల్లా కలెక్టర్ సంజీవ్ కౌశిక్ వచ్చారు. "చూడండి పిల్లలూ... మీరు మీమీ ఊళ్ళకు వెళ్ళడానికి ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేస్తున్నాము. చూడండి పి.ఏ. ఈ పిల్లలు చెప్పిన వివరాలు నోట్ చేసుకుని వీరిని ఈ సంస్థకు చేరవేసిన కాంట్రాక్టరు ఎవరో ఆచూకీ తీయించండి. ఆ రిపోర్టును ఒక కాపీ నేపాల్ ప్రభుత్వానికి పంపిద్దాం. ఈ సర్కస్ కంపెనీ యాజమాన్యంపై ప్రాసిక్యూషన్‌కి ఆదేశాలు పంపండి" అంటూ చకచకా ఆర్డర్లు ఇస్తున్నాడు.

పిల్లలందరకూ తమ ఇళ్ళూ, తమ ఊరూ అప్పుడే కళ్ళల్లో కదలాడనారంభించింది. ఆనందంగా అందరూ తమ సామాను సర్దుకున్నారు.

"ఇన్నాళ్ళూ... మా పిల్లలు మాకు దూరమై ఏడ్చాం. ఇప్పుడు తన సర్కస్ వ్యాపారం మూతపడుతోందని యజమాని ఏడుస్తున్నాడు" అంటూ ప్రయాణమవుతోందని బిష్ణూమాయ.

ఓటి బతుకులు

(9వ పేజీ తరువాయి)

వంగుడుబాయి దగ్గరకొచ్చేసరికి 'రక్'న ఆగిపోయాయి.

''ఇక్కడా పారేంటి?'' జనం అడుగుతుండగానే లారీల్లో వాళ్ళంత కూడబలుక్కున్నట్టు ఒక్కసారిగా లారీల్లో నుండి దూకి జనాన్ని తోసుకుంటు దేవరశెట్టి వాళ్ళసందున బడి మెయిన్‌రోడ్డు చేరుకుని దొరికిన ఓలో లారీలో బడి మాయమయ్యారు.

"ఇంక జూడండి! మనమీద రివర్స్ కేసు పెడతారేమో!?" అంటు లారీల చుట్టూ మూగిన ఊరివాళ్ళంతా రకరకాలుగా మాట్లడసాగారు.

జరిగిన సంఘటన ఊరంతా పాకింది. దాంతో ఇండ్లల్లో నిద్రపోతున్న వాళ్ళంతా దీపం చుట్టూ మూగే ఉసిళ్ళలా లారీల దగ్గరకు రాసాగారు.

* * *

కరువుతో నిస్త్రాణంగా మారిపోయిన ఆ ఊరికి తూర్పుదిక్కున బాల భానుడు అప్పుడప్పుడే పుట్టుకొస్తున్నాడు.

రాత్రంతా లారీల దగ్గరున్న జనం, ఆ నీరెండ పడి అప్పుడే విచ్చుకుంటున్న ఎర్రగన్నేరుల్లా వున్నారు.

అక్కడున్న వాళ్ళల్లో ఒకడైన చుట్టాకుల కోటయ్య "అయ్యల్లారా! పోరగాళ్ళు బువ్వ, బువ్వ అని పానం దింటుండ్రు. నా గన్ని బియ్యం బొయ్యిండి. పోరగాళ్ళకింత గంజిగాసి పోసుకుంటా" అన్నాడు అప్పటిదాకా నోట్లో నానుతున్న పొగాకు ముద్దను 'తుపుక్'మనిఊస్తూ.

''మా ఆడమనిషి వచ్చిబాలింత. కడుపునిండా తిండిలేక సంటి పిల్లకు పాలుగూడ పడలేదు. నాగ్గూడ ఇన్ని బియ్యం బొయ్యండి" వెంటనే లేచి నిల్చుంటు అన్నాడు ఏలాద్రి కూడా.

అంతే...

సంకోచాల పరదాలు తొలిగిస్తూ, ఒకరి తరువాత ఒకరు తిండిగింజల కోసం పడుతున్న అవస్థలు అక్కడ వినేవాళ్ళ గుండెలు కరిగి నీరయ్యేలాలో చెప్పుకున్నారు.

కళ్ళముందు అక్రమంగా

తరలించబడుతున్న బియ్యం ఒకవైపు, "అన్నమో రామచంద్రా!" అంటు అలమటిస్తున్న ఊరి జనం ఇంకోవైపు. అక్కడ కూడిన పెద్దమనుషులు ఆలోచనలు చేశారు. అయితే ఆకలి ఆలోచనల్ని మింగేసింది.

క్షణాల్లో లారీల మీద టార్పాలిన్లు గాల్లో లేచిపోయాయి.

కట్టతెగిన నీరులా... జనం లారీల మీదకెగబడ్డారు.

ఆదిమ కాలం నుండి అంతరిక్ష యానం దశదాకా ప్రస్థానం సాగించిన మనిషి విజ్ఞానం, నాగరికత ఆకలి ముందు ఎందుకూ కొరగానివైపోతాయి.

గుప్పెడు బియ్యం గింజల కోసం ఒకర్నొకరు తోసుకుంటు, రక్కుకుంటు, తిట్టుకుంటు, ఒకరికాళ్ళు ఒకరు పట్టి కిందికి లాక్కుంటున్నారు.

ఆడవాళ్ళూ, పిల్లలు ముసలివాళ్ళు నిస్సహాయంగా నిలబడి అరవసాగారు. పరిస్థితి గమనించిన ఎర్రలింగారావు పైకెక్కి బియ్యంసంచుల్ని మధ్యకోసి కిందికి కారుస్తుంటే చీరకొంగుల్లో, తువ్వాల్లల్లో, లంగా, వోణీల్లో, లుంగీల్లో ఏదీ లేని వాళ్ళు ఒంటిమీద చొక్కాల్లో ఆబగా ఎత్తుకోసాగారు.

నిమిషాల మీద లారీలు రెండు ఖాళీ అయ్యాయి.

ఆలస్యంగా వచ్చిన వాళ్ళు బియ్యం దొరక్క 'ఉస్సూరు'మని నిట్టూరుస్తు వట్టి చేతులతో తిరిగిపోలేక నేలమీద పడి జనం కాళ్ళకింద తొక్కిడి పడ్డ బియ్యాన్నే ఊడ్చుకొని ఎత్తుకుపోసాగారు.

* * *

ఆపూట గడిస్తే, బతుకే గడిచిపోయినట్టుగా భావించే ఏలాద్రిలాంటి వాళ్ళు తీసుకుపోయిన బియ్యాన్ని అప్పటికప్పుడు కడిగి పొయ్యలకెక్కించారు.

కొందరు బియ్యం దొరక్క తమ దురదృష్టాన్ని తావే నిందించుకుంటూ, దొరికిన వాళ్ళను ఆడిపోసుకుంటున్నారు.

పొద్దున లారీల్ని వదిలిపెట్టి పోయిన వాళ్ళు పోలీసుల్ని వెంటబెట్టుకొని ఊరిమీద పడ్డారు.

"దొంగబియ్యం కాదు, మల్కాపురం చెర్వుకట్ట పన్ల కోసం గవర్నమెంట్ గోదాములో నుంచి తోలుకు పోతున్న కరువు బియ్యం అని ఎంత మొత్తుకున్నా వినకుండా ఊరుదాటి పోయిన లారీల్ని వెనక్కి తిప్పిందాక మమ్ముల్ని బతకనియ్యలేదు సార్!" అంటు పోలీసులతో పాటు వచ్చిన ఎమ్.ఎల్.ఏ. తాబేదారు ఎస్సైతో చెబుతుండగానే ఎస్సై చేతిలోని సెల్‌మోగింది.

ఫోన్ తీసి చెవిదగ్గర పెట్టుకున్నాడు ఎస్సై.

"-----"

"ఆఁఆఁఫర్లేదు సార్! తయారయ్యాయా? వెంటనే పంపించండి."

"-----"

"ఆఁఆఁ రాగానే వెంటనే ఎమ్.ఆర్.ఓ.కి, కలెక్టర్ గారికి రిపోర్టు చేస్తాను" అంటు ఫోన్ కట్ చేసిన ఎస్సై, కానిస్టేబుల్ మాధవరావుతో "చుట్టుపక్కల వాడ్లందర్నీ పిలిపించండి" అంటు ఆర్డర్ జారీ చేశాడు.

"ఎవరెన్ని బస్తాలెత్తుకుపొయ్యారో తొందరగా చెప్పండ్రా! లేకుంటే ఒక్కొక్కడికి రోకలిబండలెక్కిస్తా ఏమనుకుంటున్నారో! ఐనా అవి గవర్నమెంట్ బియ్యం అనుకున్నారా! లేకపోతే మీ బాబుగాడిసొమ్మును కున్నారా?" ఆ వాడ జనం మీద పిడుగులు పడ్డట్టు గర్జించాడు ఎస్సై.

ఆ వాడ జనంలో, పెద్దమనిషి చిట్టిప్రోలు రామనర్సు "అయ్యా! మేమంతా నేతినేసుకుని పొట్ట బోసుకునే వాళ్ళమా?! ఆ జనాన్ని తోసుకొని పొయ్యి బస్తాలు తెచ్చుకునేంత కండపుష్టి మాకెక్కడిది? కావాల్నంటే మా ఇండ్లన్నీ సోదా చేసుకోండి ఒక్కింట్లో గూడా గిద్దెడు గింజలు దొరికినా మీ ఇష్టం మీరేం జేసినా పడ్తం" అన్నాడు ముందుకొచ్చి.

"అచ్ఛా! మరెవరెత్తుకెళ్ళారో చెప్పండి."

"ఎవరిని జెప్తాం సార్! వందల మందొచ్చి పడ్డారు" చెప్పాడు జల్లా సీతారాములు.

ఇలా ఐతే లాభం లేదని భావించిన ఎస్సై చుట్టూ మూగిన జనంకేసి చూస్తూ "అరేయ్! మీలో అస్సలు బియ్యం దొరకని వాళ్ళెవరో చెప్పండ్రా! మీకు నేనిప్పిస్తాగాని" అన్నాడు ఒక చేపను పట్టడానికి మరో చేపను ఎరగా గుచ్చే వేటగాడిలా.

ఎస్సై గురితప్పలేదు. బియ్యం దొరక్క నిరాశ చెందిన వాళ్ళల్లో కొందరు ముందుకొచ్చి ఎవరెవరు ఎన్ని బస్తాలెత్తుకెళ్ళారో, ఎవరెవరు పంచుకున్నారో పేర్లతో సహా బైటికి కక్కేశారు.

పోలీస్ లారీలతో వంటిమీద తట్లు తేలుతుంటే లబలబ మొత్తుకుంటు తీసుకుపోయిన బియ్యాన్ని ఒక్కక్కళ్ళే తెచ్చి లారీల్లో వెయ్యసాగారు.

కొందరు ఊరొదిలి పారిపోయారు.

ఇంకొందరు ఎక్కడ మరుగనిపిస్తే అక్కడ దాచిపెట్టారు.

మరికొందరు ఎవరు చూడకుండ బియ్యం మూటల్ని వీధుల్ల వదిలేసి చేతులు దులుపుకున్నారు.

ఇంక మరీ ఏలాద్రిలాంటి పిరికివాళ్ళైతే వండుకున్న అన్నాన్ని కూడా తీసుకుపోయి కుడితి తొట్లల్లోనో, పెంటదిబ్బల్లోనో పడేశారు.

మధ్యాహ్నం మూడుగంటల దాకా ఊరిజనం మీద పోలీసుల వీర విహారం కొనసాగుతునే ఉంది.

ఈలోగా ఎమ్ఎల్ఏ. విదిలించిన డబ్బుకు, అధికారానికి, అమ్ముడుపోయిన అధికారులు దొంగతనంగా తరలిస్తున్న కరువు బియ్యాన్ని కాస్తా నిజంగానే మల్కాపురం చెరువుకట్ట పన్లకోసం గవర్నమెంట్ గోదాము నుండే తీసుకుపోతున్న బియ్యంగా కాగితాల్ని పకడ్బందీగా సృష్టించారు.

సెల్‌ఫోన్లో కాగితాలు తయారైన విషయం విన్న ఎస్సై మరింత రెచ్చిపోతూ ఊరిజనం మీద ఏ ఏ సెక్షన్‌ల కింద కేసులు బుక్ చెయ్యెచ్చో ఆలోచించసాగారు.

దీంతో ఈ కరువు బియ్యం రాకెట్‌తో లక్షలు సంపాదిస్తుంది, తమ ఎమ్.ఎల్.ఏ., అతని తైనాతీలు అనే విషయం ఊరి జనాల ఊహలక్కూడా అందకుండా సమాధి చేయబడింది.

ఊరి జనం ఆకలిని ఏదో విధంగా తీర్చాలనుకున్న ఎర్రలింగారావు, కోట కృష్ణలాంటి పేదోళ్ళు దొమ్మీ కేసు కింద బుక్కై బెయిల్ దొరక్క ఇంకా జైల్లోనే వున్నారు.

స్థల పురాణం

లక్ష్మి

నా చిన్నతనంలో–

ఒకానొక ముచ్చట గురించి ఇప్పుడు తప్పనిసరిగా చెప్పాలి !

అప్పుడు నా వయస్సు పదేళ్లనుకుంటాను. అప్పుడప్పుడు అమ్మతో పాటు నేను మా మేనమామగారింటికి వెళ్లేదాన్ని !

మా మేనమామ పేరు కన్నరాజు!

గొప్ప గంభీరంగా వుండేవాడు మానవుడు. భారీ విగ్రహం. పెద్దపెద్ద మీసాలు. బొగ్గులవ్యాపారంతో పాటు నలుగైదు లారీలకు యజమాని !

చివర్రోజుల్లో చితికిపోయేరు గానీ–

నా చిన్నప్పుడు జమీందారల్లె వెలిగేడు !

మా మేనమామని మా అమ్మ జమీందారన్న అని పిలిచేది. మా పెద్దమ్మలు మాత్రం రాజుగాడని చెప్పుకునేవారు !

మా మేనమామగారింటో–

ప్రతిరోజూ పేకాట సాగేది !

ఆ ఇంటో ఒక పెద్దగదిని ప్రత్యేకించి పేకాటకే కేటాయించేడు మా మేనమామ. ఆయన స్నేహితులూ పరిచయస్థులూ ఎక్కడెక్కడ్నించో మేనమామ యింటికి వచ్చేవాళ్లు !

వచ్చిన వాళ్లంతా పేకాటలో కూచునేవారు !

ఈ పేకాటరాయుళ్లందరికీ కాఫీ టిఫిన్లూ...భోజనాలూ సమస్తం మా మేనమామగారింటోనే తయారయ్యేవి ! ఈ పనికోసం ప్రత్యేకించి వంటమనిషీ పనిమనిషీ వుండేవారు !

మేనమామ అండ్ కో పేకాటలో బిజీగా ఉన్నప్పుడు– ఆ గదిలోకి ఎవర్నీ రానిచ్చేవారు కాదు. మేం చిన్న పిల్లలం గదా– తెలిసోతెలీకో అటువేపు వెడితే మేనమామ గాండ్రించేవాడు !

మీకు ఇక్కడేం పని? వెళ్లండంటూ ఉరిమేవాడు !

అంచేత–

తలుపుల దగ్గిరా...కిటికీల దగ్గిరా చాటుగా నిలబడి– ఆ గదిలో సాగుతున్న పేకాట వైభవాన్ని తిలకించేవాళ్లం !

మేనమామ పేకాట విన్యాసం– గొప్ప విడ్డూరంగా వుండేది !

ఆటలో ఆయన గెలుస్తున్నప్పుడు సీట్లు మార్పిడికి ససేమిరా అంగీకరించేవాడు కాదు !

గెలుస్తున్న సీటునుంచి కదిల్తే 'లక్కు' గాలికొట్టుకుపోతుందని ఆయన విశ్వాసం !

అంచేత–

తానుమాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ సీటు మారేదిలేదని ఖరాకండిగా ప్రకటించేవాడు !

మిగతావాళ్లు–

ఎన్నితడవలు ఎన్ని సీట్లు మారినా తనకేం అభ్యంతరం లేదని చెప్పేవాడు. తమ పేకాట కొలువు మేనమామ ఇంటో సాగుతోంది గనక– మేనమామ షరతులకు మిగతావాళ్లు తలొంచేవారు !

ఖర్మకాలి–

పేకాటలో మేనమామ ముదనష్టమవుతున్నప్పుడు మాత్రం–

అస్తమానం సీట్లు మార్పిడి కోసం అల్లరిచేసేవాడు !

నిబంధనలకు విరుద్ధంగా సీట్ల మార్పిడిని డిమాండు చేసేవాడు. వీల్లేదని ఎవరైనా అభ్యంతరం చెబితే– వాళ్ల మొహమ్మీద పేక ముక్కలు విసిరేవాడు !

ఇష్టమైతే ఆడు. లేకపోతే వెళ్లిపొమ్మని అల్టిమేటమిచ్చేవాడు !

కాఫీ టిఫిన్లు భోజనాలతో పాటు అంత అందమైన సౌకర్యం మరోచోట దొరకదనే బెంగతో – అభ్యంతరం చెప్పిన మనిషే ఆల్‌రైటని మేనమామతో రాజీపడేవాడు!

ఆడపిల్లనై పుట్టి–

సిగ్గూ బిడియం ఏ మాత్రం లేకుండా చీట్లపేక గురించి ఎంతో వివరంగా.. ఎంతో విపులంగా రాస్తున్నానని కోపం తెచ్చుకోవద్దు. కళ్ళెర్ర చేయవద్దు. కనీసం విసుక్కోవద్దు!

నేను చెప్పదలిచింది –

చీట్లపేక గురించి కానేకాదు!

కేవలం సీట్ల మార్పిడి గురించేనని గ్రహించగలరు!

నాకు మా మేనమామ వున్నట్టే – మా వారికి మేనత్త వుంది. పేరు సుబ్బరావమ్మ గారు!

సుబ్బరావమ్మ గారంటే మా శ్రీవారికి వల్లమాలిన ప్రేమాభిమానాలు, అపారమైన గౌరవం!

చిన్నప్పుడు –

సదరు మేనత్త గారి చేతుల్లోనే మా వారు పెరిగేరుట! అంచేత – అత్తా అని సింపులుగా పలకరించకుండా అత్తమ్మా అంటో ఎంతో ఆత్మీయంగా పిలుస్తూ వుంటారు. ఆవిడ కూడా మావార్ని తన కన్న బిడ్డగానే చూసుకుంటో వుంటుంది!

ఆవిడగారు మా ఇంటికి తరచూ వస్తూనే వుంటారు!

వచ్చిన ప్రతిసారీ పడక ఏర్పాటు గురించి హైరానా పడుతుంటారు!

మడత మంచమ్మీద పడుక్కుంటానంటారు. ఆ రాత్రి ఆవిడకు సుఖంగా నిద్రపడితే సంతోషిస్తారు!

పీడకలలు తగులుకుంటే మాత్రం

మాయదారి మంచం... తీసవతల పారేయమంటారు. కటిక నేలమీదే పడుక్కుంటానని శపథం చేస్తారు!

నేలమీద హాయిగా నిద్రపడితే ఆనందిస్తారు. కటిక నేల నాకు కలిసొస్తుందని చెప్పుకుంటారు. అక్కడ కూడా కష్ట కలలొస్తే – నేలమీద పరుపు ఏర్పాటు చేయమంటారు!

ఆ ముచ్చట కూడా అంతే!

అందమైన కలలొస్తే అదంతా పరుపు మహత్యమంటారు. కలలు రాకపోయినా... వచ్చిన కల నచ్చకపోయినా ముదనష్టపు పరుపని తిట్టిపోస్తారు!

మంచాలూ పరుపులేకాదు –

పడుకునే చోటు కూడా తరచూ మారుస్తూ వుంటారు!

వీధి గుమ్మానికి ఎదురుగా పడుక్కుంటానంటారు. అది కలిసి రాకపోతే వంటగది పక్కన చూసుకుంటారు. అక్కడ కూడా నిద్రపట్టకపోతే స్టోరు రూములో సర్దుకుంటారు!

మా మేనమామికి తగ్గవారే శ్రీవారి మేనత్త! ◆

"పారిసా - నూయార్కా - యాడికి బోతవ్"

రుక్మిణి

ఆ దినం యాద్గిరి, జక్కులోడు, మల్లేశులు మానుకోటకు పోయింద్రు - బస్సుదిగి దగ్గర హోటల్లో చాయ్ తాగింద్రు. అవ్వాళ జక్కులోడు ఎల్.ఐ.సి. కంపెనీలో తన మూడ్నెల్లకోపాలి కట్టే పాలసీ డబ్బులు కట్టాలె - పాతికవేలు పాలసీ. ఏజెంటుకెందుకని వాండ్లవెంట దీసుకుని మానుకోటకు వచ్చిండు.

చాయ్ తాగినంక ముగ్గురు పోలీసు ఠాణాకు దగ్గరల్లోనే వున్న బీమా ఆఫీసుకు పోయింద్రు- దాని చూడటం జక్కులోడికదే మెుదటిసారి. చూడంగానే వాడికి మూర్ఛవచ్చినంత పనయ్యింది.

"అన్నా ఈ ఆఫీసు ఎంత పెద్దగా... ఎంత సుబ్బరంగా... ఎంతబాగుందేమె... అబ్బా!" అక్కడ ఒక కంపూటరు ముందు కూకున్నాయన ముగ్గుర్ని కూకోమని మర్యాదలు చేసిండు. మంచినీళ్ళు కావాల్నా అని కూడా అడిగిండు. జక్కులోడు తన పాలసీ మూడ్నెళ్ళ ప్రీమియం డబ్బులు చేతల పెట్టంగానే సదరు ఉద్యోగి మందహాసం చేసి పక్కనే డబ్బులు తీసుకునే కౌంటరు చూపిచ్చిండు. అందులో కూకున్న ఆడపిల్ల మెత్తగా నవ్వి డబ్బందుకుని కంపూటరు మీటలు టకటక లాడిచ్చింది. నిమిషంలో రసీదు తీసి జక్కులోడికందించింది. ఎంత టయం పడుతుందో... ఎన్ని టేబుళ్ళ చుట్టూ తిరిగాల్నో అని బెదిరిపోయి వచ్చిన జక్కులోడికి మతిపోయినట్లయ్యింది.

"అరె అన్నా.. నిటెంలో పనయిపోయింది. పా... పా..." ముగ్గురూ నెహ్రూ సెంటరుకు చేరుకున్నరు. అక్కడంతా గోలగోలగా వుంది. రంగురంగు జెండాలు... బ్యానర్లు జనాలు హడావుడిగా తిరుగుతున్నరు. చాలా కుర్సీలు ఏసి వున్నయ్! ఒక స్టేజి వుంది.

"ఏందే ఇదీ... ఎవరన్న మంత్రిగాని... ఎమ్మెల్లేగాని వస్తండా?" మల్లేశు వుత్సాహంగా అడిగాడు. యాద్గిరి బ్యానర్లు పోస్టర్లు చదివిండు.

"ఒరె... ఒరె... ఇక్కడో 'ఫారిన్ బీమా కంపెనీ' పెడతంద్రు. ఇవాల్నే ప్రారంభోత్సవం. అబ్బో... అది అమెరికా ఫ్రాన్సుల పెట్టుబడులతో నడిచేది.

"అందుకనే ఇంత అట్టహాసం.. వార్నీ... అందరికీ బిస్కట్లు ఛాయ్‌లు ఇస్తంద్రు... పా... పా"! జక్కులోడు ఆదుర్దాపడేలోపున అక్కడేసిన కుర్చీల్లో అందర్నీ కూచోమని మైకులో వినిపించింది. 'సరెకానియ్యండని' ముగ్గురు కుర్చీల్లో కూలబడ్డరు. సభ మొదలయింది. ఒక

సూటూ, బూటూ, టై, టోపీ తగిలిచ్చుకున్న మహానుభావుడు తెల్లంగ మెరిసిపోతండు. ఆయనగారి మొకం నిండా నవ్వే! ఆయనకి ఇంగ్లిషు తప్ప తెలుగు రాదు. పక్కనే నల్లమొద్దులా వున్న మరో నడివయసు మనిషి ఆయన్జేప్పే మాటల్ని తెలుగులోకి తర్జుమా చేస్తుండు. ఆ తర్జుమాదారుడు - ఆ అమెరికా ఏజంటు ప్రసంగించిన ప్రసంగాన్ని ప్రయాసపడి అచ్చు తెలుగులోకి తర్జుమా చేశాడు. అది -

"ప్రియమిత్రులారా... మాది "ప్యారడైజ్ బీమా పాలసీ కంపెనీ" - లక్షల కోట్ల రూపాయల పెట్టుబడితో స్థాపిస్తున్నాం. మీ గవర్మెంటు సగం కంటే ఎక్కువే మాకు వాటాలిచ్చేస్తుంది. స్థిరమైనది. దీనివల్ల మీకు కలగబోయే లాభాలుగానీ వివరిస్తే కచ్చితంగా మీకు మతులు పోతాయి. ప్లీజ్ మతులు మాత్రం పోగొట్టుకోకండి. (సభలో నవ్వులు) మీరు ఒక లక్ష రూపాయలకు గానీ పాలసీ తీసుకుంటే - ఉదాహరణకు మీ బీమా కంపెనీలో నెలకు అయిదువందలు ప్రీమియం కట్టాలి. కానీ మా పి.పి.సి.లో మూడొందలు కడితే చాలు. (సభలో ఈలలు) మీ బీమా కంపెనీ సంవత్సరానికి బోనస్ ఎనభై రూపాయలిస్తుంది. మేం నూట ఎనభై ఇస్తామని చెప్తున్నాం. (సభలో చప్పట్లు) మరో విషయం.. మీరు ఒక లక్ష రూపాయలకు మీ కంపెనీలో పాలసీ తీసుకుని గుటుక్కుమంటే లక్ష ఇస్తారు. కాని మా పి.పి.సి.లో ట్రిపుల్. మూడురెట్లు మూడు లక్షలిస్తామన్నమాట! చచ్చి మీరు స్వర్గాన అప్సరసలతో కబుర్లు చెబుతుంటే - మీ భార్యా పిల్లలు మీరిచ్చే అధిక డబ్బుతో ఇక్కడ స్వర్గ సుఖాలు అనుభవిస్తారు. చివరి విషయం - మీ కందించే డబ్బు ఏ కరెన్సీ - డాలర్లు - ఫ్రాంకులు - యూలూ - రూబుల్సు - ఏ రూపంలో కావాలంటే ఆ కరెన్సీలో పొందే సదుపాయం...

యాద్గిరి మటమటలాడాడు. "పదండెసె.. ఆకలి దంచిపారేస్తుంది". జక్కులోడు, మల్లేశులు వెంటబడి దగ్గర్లోని హోటల్లో కోడిబిర్యాని లాగించారు. తర్వాత బస్సు కోసం కురవి గేటు దగ్గరకు బయలుదేరింద్రు.

"అన్నా... ఇది చాలా బాగుందే... అబ్బో... మన యల్లైసీ కంటే ఈ పీపీసిలో లాభముందే... గండ్ల చేరితే బాగుంటదిగదా!" జక్కులోడు ఉత్సాహంగా అన్నాడు. యాద్గిరి బీడీ వెలిగించి గప్పుమని రెండు పీకులు పీకి జక్కులోడి వంక చాలా జాలిగా చూసిండు.

"ఒరే పిచ్చినాయ్నా... మన యల్లైసీ గొప్పదనం నీకు పూరాగా తెల్వదు. మన బీమా కంపెనీ యాభైఏండ్లు నిరంతరం ప్రజల నమ్మకాన్ని చూరగొని రెండు లక్షల కోట్లకు పైగా ఆస్తులను పెంచింది. అది మన ప్రజల సొత్తు. ఆస్థి - అవసరం పడినప్పుడల్లా ఇటు ఆర్టీసీకి - అటు విద్యుత్ రంగానికీ ప్రజల సేవల కోసం వందల కోట్ల రూపాయలు అప్పుగా ఇచ్చి ఆదుకుంటుంది. లక్షల మందికి ఉపాధి కల్పిస్తుంది."

'అది కాదె అన్నా.. మరి పి.పి.సి. వాడు ఎక్కువ సొమ్ము ఇస్తానంటున్నాడు గద..." మల్లేశు అమాయకంగా అడిగాడు.. వాడ్ని యాద్గిరి చాలా జాలిగా చూశాడు.

"ఒరే వాడు డాలర్లు... ఫ్రాంకులు అంటున్నాడు. నువ్వు కట్టిన డబ్బు నువుగా చస్తే గానీ.. కాలం తీరినాగానీ... వాడుండే ఏ న్యూయార్కో, ఫ్రాన్సు హెడ్డాఫీసుకో పోయి తెచ్చుకోమంటాడు - నీ పెండ్లాం లండను పోతుందా; నువ్వు పారిస్ పోతవా...?

మల్లేశు కూకున్న బండరాయి మీద నుండి విరుచుకుపడ్డాడు - "వాడి ఆఫీసూ - కంపెనీ ఈడ్నే వున్నయి గదనే" మరీ మూర్ఖంగా అడిగిండు.

"ఒరె దమాక్ లేనోడా.. అర్బన్ బ్యాంకులు కోట్లు కోట్లు జనం దగ్గర్నుండి దండుకుని రాత్రికి రాత్రి బోర్డును బురదలో తొక్కి బలాదూర్‌గ పరారై పోతే ఎవరేం చేసింద్రు. ఇదీ అంతే! బాగా దండుకుని వాడు లండన్‌కు లగాయిస్తే పాలసీదార్లంతా లండన్ కోర్టుకు వురుకుతరా... స్వర్గంలో వాడు మీకు దొరుకుతడా? జక్కులోడికి మూర్ఛరాబోయేంతలో బస్సు వచ్చింది. ముగ్గురూ బస్సెక్కారు.



డాక్టర్ వి.వి.బి. చౌదరి
సురక్ష న్యూరో సెంటర్, విజయవాడ

మూర్ఛరోగం గురించి అనేక రకాల కల్పితాలు ప్రచారంలో ఉండేవి, ఉన్నాయి. ఒక రాక్షసి వాత రోగం (మూర్ఛరోగం) కలిగిస్తుందని, ఇదొక పవిత్రమైన జబ్బు అని ఇలా అనేక రకాలు ప్రచారంలో వున్నాయి. రకరకాల వైద్య విధానాల (వైద్య విన్యాసాల)తో, మోసపూరిత ప్రకటనలతో ప్రజలు మోసగించబడుతున్నారు.

మూర్ఛరోగం (ఎపిలెప్సి) అంటే ఏమిటి?



అసలు మూర్ఛ లేదా వాతం అనేది ఒక రోగం కాదు. ఇది మెదడుకు సంబంధించిన అనారోగ్యానికి ఉన్న చిహ్నం లేదా లక్షణం. మన మెదడులో 'న్యూరాన్' అని పిలువబడే అనేక కణాలు (న్యూరోసెల్స్) ఉంటాయి. ఇవన్నీ ఒకదానికొకటి ముడిపడి వుంటాయి. ఇవి మన ప్రతి పనిని, ఆలోచనను అదుపు చేస్తాయి. రోజూ మన దైనందిన జీవితంలో కొన్ని కోట్ల సందేశాలు ఈ కణాల నుండి విడుదల అవుతాయి.

ఈ సందేశాలు ఒక పద్ధతి ప్రకారం ఒక కణం నుండి మరొక దానికి ప్రయాణిస్తాయి. కొన్ని సందర్భాలలో ఈ న్యూరాన్స్ నుండి అసాధారణమైన 'ఫాస్ట ఎలక్ట్రికల్ డిశ్చార్జస్' విడుదల అవుతాయి. అవి మూర్ఛ లేదా వాతాన్ని కలిగిస్తాయి.

ఎపిలెప్సీ (మూర్ఛ) ఎవరికి వస్తుంది?

ఈ మూర్ఛ లేదా వాతం అనేది ఎవరికైనా, ఏ వయస్సులో (అప్పుడే పుట్టిన పసికందు నుండి పండు ముసలి వరకు) వారికైనా రావచ్చును. మగ, ఆడ, కుల, మతాల భేదాలు లేవు. మనలో చాలామంది అనుకునే దానికంటే మూర్ఛ సర్వసాధారణమైనది. ప్రపంచ నిపుణుల అంచనాల ప్రకారం ప్రస్తుతం జనాభాలో ఒక శాతం కంటే ఎక్కువ మందే తన జీవిత సమయంలో ఏదో ఒక రూపంలో మూర్ఛకు గురయి ఉన్నారు.

కారణాలు

ఈ మూర్ఛ లక్షణానికి కారణాలు పరిశీలిస్తే 60 శాతం మందిలో ఎటువంటి కారణం కనిపించదు. మిగిలిన వారిలో కొన్ని కారణాల వలన మూర్ఛ రావచ్చు. ఈ కారణాలలో కొన్ని :

☆ మెదడు కణాలకు దెబ్బ తగలడం
☆ జన్మించేటప్పుడు కలిగిన గాయం
☆ చిన్న పిల్లలలో ఎక్కువ జ్వరం రావటం వల్ల
☆ కొన్ని సూక్ష్మ జీవుల (వైరస్) వలన ఉదా : మెదడువాపు వ్యాధి
☆ పెద్ద మోతాదు లలో కొన్ని మందులు లేదా విష పూరితమైన పదార్థాలు తీసుకోవడం వల్ల
☆ మెదడుకు ఆక్సిజన్ సరిగ్గా అందకపోవడం వల్ల
☆ పక్షవాతం మెదడులో గడ్డలు (ట్యూమర్) పెరగడం వల్ల
☆ రక్తపు బేలన్స్‌ను దాని రసాయనిక నిర్మాణాన్ని, మార్చే జబ్బుల వలన.
☆ చాలా తక్కువ సందర్భాలలో వారసత్వంగా

ఈ కారణాలు ఏమీ పైన పేర్కొన్న విధంగా 60 శాతంలో ఉండకపోవచ్చు.

మూర్ఛ అనేది అంటురోగం కాదు. ముట్టుకోవడం వలన లేదా ముద్దు పెట్టుకోవడం వలన మూర్ఛ రాదు. కొన్ని ప్రత్యేక సందర్భాలలో వారసత్వపు బదిలీ ద్వారా సంక్రమించవచ్చు. కానీ ఈ వారసత్వం అనేది అతి తక్కువ సాధారణమైనది. చిన్న పిల్లలలో మాత్రమే ఎక్కువ కనబడుతుంది.

మూర్ఛ ఎన్ని రకాలు

ప్రతి మనిషికి ముక్కు, రెండు కళ్ళు, రెండు చెవులు, ఒక మూతి ఉన్నా రకరకాల ముఖ కవళికలు ఉన్నట్లు మూర్ఛలో కూడా అనేక రకాలు వున్నవి. సుమారు 40 రకాల మూర్ఛలు కనుగొనబడ్డాయి. వీటిని వైద్య రంగంలో వివిధ పేర్లతో పిలుస్తారు. ప్రధానంగా మూర్ఛను పాక్షికం (పార్షియల్) లేదా

సాధారణీకరించినది (జనరలైజ్డ్)గా వర్గీకరించవచ్చును. ఈ వర్గీకరణలో ప్రతి దానిని ఉపవర్గాలుగా విభజించవచ్చును. పాక్షిక మూర్ఛలో శరీరములోని ఒక భాగము లేదా ఒకవైపు పూర్తిగా మూర్ఛకు గురి అవుతాయి. ఈ పార్షియల్ మూర్ఛలో కొంతమంది హెచ్చరికను అనుభవిస్తారు. దానినే సంవేదన (ఆరా) అంటారు. కొంతమంది శబ్దాలు లేదా సంగీతం వినడం లేదా ఒక అపరిచితమైన రుచి లేదా ఒక విచిత్రమైన సువాసన, టెన్షన్ లేదా ఆతృత అనుభవిస్తారు. ఈ హెచ్చరికలు కూడా మూర్ఛలో ఒక భాగమే. కొన్ని సందర్భాలలో హెచ్చరికతో ఆగిపోవచ్చు. లేదా జనరలైజ్డ్‌గా మారవచ్చును.

సాధారణీకరించిన (జనరలైజ్డ్) మూర్ఛలో రోగి తెలివి తప్పడం, పడిపోవడం, కదలకుండా బిగుసుకుపోవడం, మెలికలు తిరిగిపోవడం లేదా ఆకాశంలోకి కళ్ళను తేరిపార చూడటం, ఇలా ఏదో ఒకటి జరగవచ్చును.

ట్రిగ్గర్స్

సాధారణంగా అనేక సందర్భాలలో మూర్ఛ సడెన్‌గా వస్తుంది. కొన్ని సందర్భాలలో కొన్ని కారణాలు ఈ మూర్ఛ వచ్చే వారిలో మూర్ఛను కలిగించవచ్చును. అందులో ముఖ్యమైనవి ఆల్కహాల్ (సారా), ఆందోళన, మెరిసే లైట్లు, నిద్రలేమి, ఏదైనా జ్వరం రావటం, రక్తంలో సుగరు తగ్గటం వలన, కొంతమంది స్త్రీలలో బహిష్టు సమయంలో, కొంతమంది మందులు మానివేయటం. వీటినే ట్రిగ్గర్స్ అంటారు.

మూర్ఛ వచ్చినపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు

- ◆ దుస్తులు, ప్రత్యేకంగా మెడ దగ్గర వదులు చేయాలి.
- ◆ ఏమైనా ప్రమాదం కలిగించే వస్తువులు మూర్ఛ వచ్చిన వ్యక్తికి దగ్గరగా లేకుండా చేయడం.
- ◆ తలక్రింద ఏమైనా మెత్తటి వస్తువు వుంచాలి.
- ◆ మూర్ఛ ఆగిన వెంటనే ఆ వ్యక్తిని ప్రక్కకు పడుకోబెట్టాలి. ఊపిరిసరిగా తీసుకోవడానికి ఇది ఉపయోగ పడుతుంది.
- ◆ మూర్ఛ సమయంలో నోటిలో గుడ్డలు కుక్కటం లేదా ఏదైనా వేరే వస్తువు పెట్టటం లాంటివి చేయరాదు.
- ◆ మూర్ఛ వచ్చిన సమయంలో కాళ్ళు, చేతులు గట్టిగా పట్టుకొనుట లేదా కట్టివేయడం చేయరాదు.
- ◆ నోటి నుంచి వచ్చిన నురుగను తుడిచివేయాలి.
- ◆ మూర్ఛ 5 నిమిషాల కన్నా ఎక్కువ సేపు వున్నా లేదా మూర్ఛ మరలా మరలా వస్తూ మధ్యలో రోగి తెలివి లేకుండా వుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.
- ◆ మూర్ఛ సమయంలో దెబ్బ తగిలి రక్తస్రావం జరుగుతున్నా డాక్టర్‌ను సంప్రదించాలి.

మూర్ఛకు వైద్యం ఏమిటి?

ప్రధానంగా మూర్ఛను మందులతో కంట్రోల్ చేయవచ్చు. ప్రతి వ్యక్తిని పరీక్షించి మూర్ఛకు ఏదైనా కారణం ఉంటే ఆ కారణానికి వైద్యం చేస్తే మూర్ఛ తగ్గుతుంది. అంటే ఏదైనా ఇన్‌ఫెక్షన్ (సూక్ష్మజీవుల) వలన లేదా మెదడులో గడ్డల వలన మొదలగునవి. మూర్ఛకు మందులే ప్రధాన వైద్యం. ప్రస్తుతానికి ఒక డజనుకు పైగా మందులు లభ్యమవుతున్నాయి. ఈ మూర్ఛకు మందులు ఒక్కో వ్యక్తికి వారి వారి మూర్ఛ లక్షణాలను బట్టి, మూర్ఛ రకాన్ని బట్టి ఇవ్వవలసి వుంటుంది. ఒక రోగికి ఉపయోగపడిన మందు మరొకరికి ఉపయోగపడకపోవచ్చు. వారి బరువును బట్టి మోతాదు, మూర్ఛ రకాన్ని బట్టి మాత్రనూ నిర్ణయించవలసి ఉంటుంది. సాధారణంగా చాలా మందిలో మూర్ఛ మందులతో తగ్గుతుంది. కొంత మందికి రెండు లేదా మూడు రకాల మందులు ఇవ్వవలసి రావచ్చును. కొద్ది శాతం మందిలో ఎన్ని మందులు వాడినా మూర్ఛ వస్తుంటే శస్త్ర చికిత్స వలన ఉపయోగం వుంటుందేమో పరీక్షించి, అవసరమైతే శస్త్ర చికిత్స (ఆపరేషన్) చేయవలసి వుంటుంది.

మీకు మా విజ్ఞప్తి

మూర్ఛ ఉన్నవారు కూడా మిగిలిన అందరిలాగా జీవించవచ్చును. ఏదో కొద్దిమందికి తప్ప మెజారిటీ మూర్ఛ వ్యాధి వున్నవారికి సాధారణ జీవనానికి ఎటువంటి ఆటంకం ఉండదు. కాబట్టి మీరు మోసపూరితమైన మాటలకు, అనవసర వైద్యానికి, పరీక్షలకు లోనుకాకుండా సరైన వైద్యుని సంప్రదించి సరైన వైద్యం పొంది అందరిలా చక్కటి జీవితాన్ని మీ సొంతం చేసుకోండి. మీకు తెలిసిన మూర్ఛ ఉన్న వారికి మీరే మార్గం చూపించి వారికి సరైన సలహా ఇచ్చి వారి జీవనాన్ని ప్రభావితం చేయండి.



పిల్లల్లో మూర్ఛ రాకుండా జాగ్రత్తలు

మనం అప్పుడప్పుడూ కొందరు చిన్నారులలో ఫిట్స్ రావడం చూస్తుంటాం. కొన్ని ప్రాంతాలలో ఈ ఫిట్స్‌ను 'మూర్ఛ' అని, మరికొన్ని ప్రాంతాల్లో 'ఈడుపు' అని కూడా అంటుంటారు. ఇంగ్లీషులో 'ఫిట్స్' అంటారు. చిన్నారులలో ఫిట్స్ చూసిన వెంటనే మనలో ఒక విధమైన ఆందోళన, నిస్సహాయత, భయం ఏర్పడుతుంది. ఎవరైనా సహాయం చేస్తారేమోనని అటూ ఇటూ చూస్తాం. వ్యక్తుల స్థాయి ఏదైనా ఇదంతా సహజం. ఇందులో డాక్టరైనా, నర్సయినా భావాలు ఒకటే. ఫిట్స్ చూసిన వెంటనే సహాయం కోసం ప్రయత్నిస్తూ ఇలా చేయండి.

- ◆ గుడ్డతో చుట్టిన ఏదైనా ఒక వస్తువు నోటి మధ్యలో ఉంచండి. దీనివల్ల రోగి నాలుక కొరుక్కునే అవకాశం ఉండదు.
- ◆ బలవంతంగా ఫిట్స్ ఆపు చేయకండి.
- ◆ చుట్టూ మనుషులు గుంపుగా చేరకండి. గాలి బాగా వచ్చేట్లు చూడండి.
- ◆ ఫిట్స్ వచ్చిన పిల్లల్ని పదునైన వస్తువులకు, నిప్పుకు దూరంగా ఉంచండి.
- ◆ ఫిట్స్ వస్తున్న చిన్నారికి వాంతి అవుతుంటే ఒక పక్కకు తిప్ప పడుకోబెట్టండి.
- ◆ ఫిట్స్ తగ్గిన తర్వాత పిల్లలు నిద్రపోవడం సహజం. పిల్లలు పలకడం లేదని ఆందోళన పడకుండా నిద్రపోనివ్వండి.
- ◆ మగతగా వున్నప్పుడు నోటి ద్వారా ఎలాంటి ఆహార పదార్థాలు ఇవ్వకండి.
- ◆ ఫిట్స్ నుండి తేరుకున్న తర్వాత వేడి ద్రవపదార్థాలైన కాఫీ, టీ, పాలు... ఏదో ఒకటి ఇవ్వండి. మత్తుగా వుంటే ఏమీ తాగించకండి.
- ◆ కొందరు పిల్లల్లో జ్వరం వస్తే ఫిట్స్ వస్తాయి. సాధారణంగా వైద్య చికిత్సకు పోయేలోపే తగ్గిపోతాయి. ఇటువంటి పిల్లల్లో ఫిట్స్ రాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలి. వీరికి జ్వరం అని అనుమానమొస్తే తడిబట్టతో శరీరాన్ని బాగా తుడవండి. పారసిటమాల్ మందు వెయ్యండి. తర్వాత డాక్టర్‌ను కలవండి. ఈ చర్యల ద్వారా కొంతవరకు పిల్లల్లో 'ఫిట్స్' నిరోధించవచ్చు.

ఫిట్స్‌కి కారణం ఏదైనా వెంటనే చేయవలసింది పైన తెలిపిన చర్యలే. ప్రథమ చికిత్స తర్వాత వైద్య సహాయం పొందండి. ఫిట్స్ వచ్చిన చిన్నారికి మనమే ఎన్నో సపర్యలు చేయగలం. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూస్తుంటే, ఎన్నో అనర్థాలు జరిగిపోతాయి.

- డాక్టర్ ఆరవీటి రామయోగయ్య

పుస్తక పరిచయం

మట్టి పరిమళాల 'రైతు కవిత'

పాటల్లో "జనంపాట" అనగానే అది ఎవరిదో, ఎవరికో, ఏ తాత్వికతకు చెందిందో చప్పున తెలిసిపోతుంది. అలా ఖచ్చితంగా ఈ కవిత్వం ఫలానా అని భేరీమోగించి చెపుతుంది 'రైతు కవిత'. మట్టినీ, మట్టి మనుషుల్నీ, మట్టి పరిమళాల్నీ – మట్టిలో చెలరేగే అంతర్ ఘర్షణలనూ ప్రేమించే ఓ ముగ్గురు రైతు బిడ్డల సంపాదక సేద్య ఫలితం ఈ కవితా సంకలనం. ఇందులోని ప్రతీ కవితా పచ్చని చేల్లో వరినాట్లు లాగా నాటిన ఆ ముగ్గురు కవికర్షకులు పాపినేని శివశంకర్, బండ్ల మాధవరావు, ఎమ్వీ రామిరెడ్డి.

"మన దేశంలో సంపద సృష్టికర్తలు గాక సంపద భోక్తలు మాత్రమే ఎలమీద కనబడ్డారు. మొదటి మౌర్య రాజెవరో, చివరి మొగలు రాజెవరో మనకు తెలుసుగానీ నాగలి కనిపెట్టిన వాడెవడో తెలీదు. జడ్డిగంలోంచి నాలుగు చాళ్ళలోకి ఒకేసారి విత్తనాలు వెదబెట్టిన తొలి కళాకారుడెవరో తెలీదు." ఆ మాటలు ఈ మట్టి కవితలచేను మంచెపై నిలబడ్డ వడిసెల రాయి విసురే వాడి తీక్షణమైన చూపుల్లాగా ఉన్నాయి. బహుశా ఆ చారిత్రక వెతుకులాట పొలంగట్ల మీంచే మొదలయ్యిందాన్నంత గాఢంగా ఉంటాయి ఇందులోని కవితలు.

పాతకావుల్లో చిలకమర్తివారి నుండి గరిమెళ్ళ, సుద్దాల లాంటి ఉద్యమకవులు సహితంగా తుమ్మల లాంటి కవిత్వ మోతుబరుల వరకు వారి కవిత్వాన్ని ఇందులో మోపుకట్టడం (సంకలనం చేయడం) ద్వారా చారిత్రక బాధ్యతను వహించారనిపిస్తుంది. "ఈ సేనెవరిదిరా వెంకయ్యా" అంటే "ఫలానా రంగయ్యదండీ" అన్నంత కొండగుర్తులాగా ఈనాటి కవితా ధార ఆ పాత కాపుల ఫలసాయమేనని చెప్పిటన్లనిపిస్తుంది. "పల్లెటూరి పిల్లగాడా... పసులగాసే పిల్లగాడా"ని కవితలా చదివినా, జనం పాటగా పాడినా వినేవాళ్ళకు ఆ పసోళ్ళు కళ్ళ ముందు నిలబడినంత గాఢమవుతుంది. "ఏటికేతామేసి ఎయిపుట్లు పండినా...", "ఒలియోఒలీ" లాంటి గేయాలు "వాటిని మించిన కవిత్వం మళ్ళీ రాదా" అన్నంతగా నేటికీ అనుభూ"తియ్యంగా" ఉంటాయి.

"నేను పంట పొలాల మీంచి....
ఉద్వేగంగా విసరబడ్డ వడిసెల రాల్చిన ధూళిని"
(నాగభైరవ కోటేశ్వరరావు)

అని ఇందులోని నేటి కాపులు తమ ఉనికి, తమ తాదాత్మకత దేనిలోనో ప్రకటించుకున్నారు.

"నన్ను చర్నాకోలతో కొట్టండి
నన్ను చిదిపి చినుకు దీపం పెట్టండి" (కె. శివారెడ్డి)

అంటూ నేలకున్న మట్టికి వాన చినుక్కి ఎంత అనుబంధమో అంతకు మించిన అనుభూతిని కవితీ్వకరించారు.

"పురుగును చంపలేని మందులు
రైతు ప్రాణం తీయగలిగినప్పుడు
మందుల్లో కల్తీ లేదని రాబందులు ప్రకటిస్తాయి.
......
ఖండాంతర లావాదేవీల్లో
జాతి వెన్నుముకలను తాకట్టు పెట్టిన వాళ్ళనే ప్రశ్నిస్తాను"
(పాపినేని శంకర్)

అని ప్రశ్నల కొడవళ్ళు, విమర్శల వడిసెల రాళ్ళ అవతారాలెత్తారు ఇందులోని కవులు.

"నేలపై నీ అభిప్రాయాలు సాలుపోస్తూ
నువ్వేమి ఆలోచిస్తున్నావో నాకు తెలుసు
భవిష్యత్తు నీ కోపం నుండే ఉదయిస్తుందనీ తెలుసు"
(ఖాయ్యూంజ్)

అంటూ నేల పొరల్లోని సంఘర్షణలను స్వాగతించే పోరు గాలులవుతున్నారు.

"ఓరి టెర్మినేటరూ... ఓరి ట్రైటరూ
......
జీవనాడుల్ని నాటుకున్న వాళ్ళం
గింజలో బతుకు పొలాల్ని నాటుకున్న వాళ్ళం
......
నీళ్ళకే కాదు మట్టికీ ఉప్పెనలొస్తాయి"
(అద్దేపల్లి రామమోహనరావు)

అంటూ సామ్రాజ్యవాదులను హెచ్చరించే చూపుడు వేళ్ళవుతున్నారు.

"మన దేశంలోని ప్రతివూరూ ఓ పత్తి చేనే
ప్రతీ గుడిసే ఓ ప్రతిమొగ్గే
నిలువెత్తు కాలిపోయే కొవ్వొత్తిదారం కూడా ఈ పత్తి మొగ్గలదే
అయినా పాలించే రాజకీయమే పత్తి పురుగు అయ్యింది కదా"

నాళేశ్వరం శంకరం లోని ఈ కవిత చేల్లోని కలుపు మొక్కల్ని గుర్తు పట్టే రైతు చెయ్యంత చురుగ్గా తగుల్తుంది.

"ఎండిపోయిన మావూరి చెరువును చూస్తుంటే / నా కడుపు చెరువవుతుందని" దిలావర్ కవి కన్నీరవుతుంటే, "ఒక్క వాన వొంగితే చాలు – ముక్కాలు వంటన్నా చేతికొస్తుంది" అని నన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి వాన్నీరు కోసం కవితా మొరలెత్తారు.

"నాలుగు చినుకులు లేక నాగలి కౌగిలి లేక / తనువంతా బీటలుగా కోతలు పెట్టుకుంది" (పాటిబండ్ల రజని) 'ఐలెమ్మపుడూ గుర్తే... మట్టిపూచిన మనిషిపువ్వు" (రాళ్ళబండి నరసింహరాజు) 'బతుకు రైలు బండి పరుగెత్తడానికి / అమ్మ పగలంతా పొలంలో పచ్చజెండాలు నాటేది' (చింతా అప్పల్నాయుడు).. "కుకుమన్నా గీ మన్నుల జపాను దేశాన్ని దింపేదానికి అప్పుజేసినవా సొంత ఇమానం కొనేదానికి అప్పు జేసినవా" (కొండేపూడి నిర్మల)... ఇలా ఎన్నో రైతుకవితల్ని చేటలో పోసి తూర్పార పోస్తే పాఠకుల, పాఠకులైన రైతుల మనసుల్లో నాటుకునే కవితా పాదాలు కుప్పలా పెద్దరాసిలా పడతాయి. డెబ్బయి ఐదు మంది కవుల, 75 కవితా పనల్ని మరో 17 పాత కాపుల కవిత్వ ఓదెలతో కట్టిన మోపు ఈ సంకలనం.

- శంకర్

రైతు కవిత
(కవితా సంకలనం)

సంపాదకులు : పాపినేని శివశంకర్, బండ్ల మాధవరావు, ఎమ్వీ రామిరెడ్డిలు, ముప్పా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ వారి ఏడవ ప్రచురణ.
వెల : 75 కవితలకు 75 రూపాయలు. మరో 17 అపురూప కవితలు బోనస్, రైత్వారీ సామెతలు అమూల్యం.
ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లోనూ దొరుకుతుంది.

స్వీకారం

నాయుడుబావ పాటలు
రచన : సాదనాల వేంకటస్వామి నాయుడు;
వెల : రూ. 25/–; ప్రతులకు : హిమకర్ పబ్లికేషన్స్, 79–2–3, ప్రశాంతి ఎస్టేట్, తిలక్ రోడ్, రాజమండ్రి.



విశాల సాహితి సామాజికచైతన్య పాటలు
సంపాదకులు : బి.ఎస్.రాములు; వెల : రూ. 75/–; ప్రతులకు : విశాల సాహితి అకాడమి, యూనివర్సిటీ ఆఫ్ సోషల్ ఫిలానఫీ, 2–2–186/53/5, రామకృష్ణనగర్, బాగ్అంబర్‌పేట, హైదరాబాద్

ప్రభాత్

అరేబియా సముద్ర తీరం కొచ్చిన్

మన రాష్ట్రంలో విజయవాడ రైల్వే స్టేషన్ బయట రాష్ట్రాలకు ఎక్కువ రైలు మార్గాలున్న స్టేషన్. ఆ స్టేషన్‌లో మనం అనేక సార్లు "కొచ్చిన్-గౌహతి" సూపర్ ఫాస్ట్ రైలు గురించి చూసుంటాం. ఎనౌన్స్‌మెంట్లో వినుంటాం. మన సోషల్ స్టడీస్ పాఠ్య పుస్తకాల్లో కొచ్చిన్ రేవు, కొచ్చిన్ పట్టణం గురించి, చరిత్ర గురించి చదివి వుంటాం. కేరళ రాష్ట్రంలో ఉందండీ ఈ కొచ్చిన్.

ఆ కొచ్చిన్ దక్షిణ భారతదేశంలోని ముఖ్యరేవు పట్టణాల్లో చారిత్రాత్మకమైనది కూడానండీ.... దీన్ని "క్వీన్ ఆఫ్ అరేబియన్ సీ" అని కూడా అంటారు. ఇండియాలోని ముఖ్య పట్టణాల్లో ఇదొకటండి. అందమైంది కూడాను... వ్యాపారానికి, ప్రపంచ సముద్రమార్గాలకు కూడా ఇది ఓ ముఖ్యమైన రేవు కదా... అందుకని అరబ్బులు, చైనీయులు, డచ్, బ్రిటీష్, పోర్చుగీసు తదితర దేశాల వ్యాపారులు, పాలకులు వచ్చారు... వెళ్ళారు.... వారి సంస్కృతులను జ్ఞాపకాలుగా వదిలారు. అలాగే ఈ రేవు నుంచే దూరప్రాచ్యదేశాలకూ, మధ్యఆసియా దేశాలకు వాణిజ్యానికి మన భారతీయ వర్తకులు కూడా వెళ్ళారండీ.

ఈ చారిత్రాత్మకమైన, వాణిజ్యపరమైన, భిన్నమతాల సంస్కృతులు, నాగరికతల జ్ఞాపికలతో వున్న ఊరండీ ఈ కొచ్చిన్. అందుకనే ఇదొక పర్యాటక ప్రాంతం కూడా.

ఈ కొచ్చిన్‌కి ఎంతో అందమైన సముద్ర తీరం ఉంది. ఒడ్డున జాలర్లు కట్టిన వలల గడుల్లోంచి ఉదయించే సూర్యుడినీ, సముద్ర అలల్లో సూర్యబింబ ప్రతిబింబాన్ని చూడవలసిందే గానీ వర్ణించలేం. ఇక్కడున్న దేవాలయాలు, చర్చీలు యూదుమందిరాలు ఆర్కియాలజిస్టులు, చరిత్రకారులే కాదండీ... భక్తులకు, ప్రకృతి ఆరాధకులకు అందరికీ చూడాలనిపించేవే. యర్నాకులం పర్వత సానువుల్లో విల్లింగ్టన్, బొల్గాట్టీ, వైపీన్ లంకలు, కొచ్చిన్ కోట తదితర దర్శనీయ స్థలాలతో కొచ్చిన్ కొలువుదీరి వుంటుంది. ఒకరకంగా కేరళలోనే కాస్మోపాలిటిన్ సిటీ ఇది.

డచ్ ప్యాలెస్ : దీన్ని క్రీ.శ. 1555లో పోర్చుగీసు దేశం వారు నిర్మించి ఆనాటి రాజా వారికి బహుకరించారు. పోర్చుగీసు వారు నిర్మించినా దాన్ని డచ్ ప్యాలెస్ అని పేరు పడింది. డచ్ వారు దానిని మరమత్తులతో పునఃనిర్మించారు. దాని లోపలి గోడలపై రామాయణ, మహాభారత గాధల చిత్రాలతో అద్భుతమైన పెయింటింగ్స్ ఉన్నాయి. శుక్రవారం, పండుగ శలవు రోజుల్లో తప్ప మిగిలిన అన్ని రోజుల్లో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు సందర్శకులకు తెరచి ఉంటుంది.

యూదు మందిరం : క్రీ.శ. 1568లో నిర్మించిన ఈ మందిరాన్ని 1662లో పోర్చుగీసు వారు కొంతమేర నాశనం చేశారు. ఆ తరువాత డచ్ పాలకులు దాన్ని పునర్నిర్మించారు. రాగి శిలాఫలకాలపై చెక్కిన హిబ్రూ ఓల్డ్ టెస్ట్‌మెంట్స్ రాజప్రతులున్నాయి. ఇది శనివారం, యూదుల పర్వదినాలలో తప్ప మిగిలిన అన్ని రోజులూ ఉదయం 10-12 గంటల మధ్య, సాయంత్రం 3-5 గంటల మధ్య తెరచి ఉంటుంది.

కొచ్చిన్ కోట : ఈ కోట యర్నాకులం నుంచి 10 కి.మీ.ల దూరంలో ఉంది. దీనిదగ్గరకెళ్ళడానికి బస్సులు, రాదారి పడవలూ చాలా వున్నాయి.

సెయింట్ ఫ్రాన్సిస్ చర్చి : క్రీ.శ. 1510లో నిర్మించిన ఈ ప్రొటెస్టెంట్ చర్చిని పోర్చుగీసు వారే నిర్మించారు. మన దేశానికి సముద్రమార్గం కనుగొన్న ఒకనావికుడైన వాస్కోడిగామా 1524లో చనిపోతే ఇక్కడే సమాధి చేశారు. 14 సంవత్సరాల తరువాత ఆయన అస్థికల్నే పోర్చుగల్‌కు తీసుకుపోయారట.

ఇవి పురాతన చారిత్రక సందర్శనా స్థలాలనుకోండి. ఆధునిక కట్టడాలు "శాంతాక్రుజ్ బాసిలికా" (ఓ కళాత్మక అద్భుత ఆరోసియం చర్చి), కొచ్చిన్ హార్బర్‌లో అలంకరించిన చైనా వలలు, కృత్రిమ నిర్మాణమైన విల్లింగ్‌టన్ ద్వీపం (ఇందులోనే హార్బరు, రైల్వేస్టేషన్ టెర్మినల్స్, విమానాశ్రయం కూడా ఉందండోయ్).

బొల్గాట్టీ లంక : ఇక్కడే టౌన్ ప్యాలెస్ ఉంది. బ్రిటీష్ పాలకుల కార్యాలయాలున్నాయి. వాటినే ఇప్పుడు కేరళ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు ఓ పెద్ద హోటల్‌గా మలిచారు. ఇక్కడకు రావటానికి ఎర్నాకులం నుండి రహదారి పడవలు, నాటు పడవలు (మచువాలు) ప్రతి పావుగంటకొకటి ఉంటాయి. హైకోర్టు జెట్టీ ఒడ్డున దిగొచ్చు.

శివాలయం : కొచ్చిన్‌కు సరిగ్గా సెంటర్‌లో దర్బార్ హాల్ దగ్గరల్లో ఉంది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో జరిగే ఎనిమిది రోజుల ఉత్సవం సంగీత, నృత్య, దైవిక కార్యక్రమాలతో బాగా నిర్వహిస్తారు.

మ్యూజియమ్‌లు, ఆర్ట్ గ్యాలరీలు : డి.హెచ్.రోడ్డులోని దర్బార్ హాల్ గ్రౌండ్స్‌లో ఇవి వున్నాయి. కేరళ చారిత్రక మ్యూజియం, పరిషత్ థెంపూరన్ మ్యూజియం రెండు చూడదగ్గవి. ❖







"మరణం మాత్రమే నాలోని కళాకారుడికి తుది వీడ్కోలు చెప్పగలదు" - మెహమూద్ అలీ.

రైల్లో స్వీట్లు, ఐస్‌క్రీమ్‌లు అమ్ముకుని జీవిక సాగించే పన్నెండేళ్ళ వయసున్న ఓ కుర్రవాడు భారతీయులందరినీ అలరించే గొప్ప హాస్యనటుడ్నవుతానని కలలోనైనా ఊహించి ఉండడు. అతనే మెహమూద్.

హెచ్.రమేష్‌బాబు

విలక్షణ సినీ విదూషకుడు మెహమూద్

మెహమూద్ పుట్టింది గోవాలో 1932లో. తాత సయ్యద్‌ముర్తుజా గొప్ప రంగస్థల నటుడు. తండ్రి ముంతాజ్ అలీ అభూతకన్య, కంగన్, ఝూలా, బంధన్ వంటి బాంబేటాకీస్ చిత్రాల్లో నటించిన పేరున్న నటుడు, నర్తకుడు. తండ్రివెంట అప్పుడప్పుడు షూటింగులకు వెళ్ళే మెహమూద్ తొలిసారి 'కిస్మత్'లో అశోక్ కుమార్ చిన్నప్పటి వేషం వేశాడు. అయితే ఇవన్నీ అతనికిష్టం ఉండేది కాదు. ఇంట్లో తినడం అల్లరి చిల్లరగా తిరగడం చేసేవాడు. కొంతకాలం తరువాత తండ్రికి అవకాశాలు లేక కుటుంబం గడవడం కష్టమైంది. ఇదేమీ పట్టని మెహమూద్ ఓ రోజు తాను ఇంట్లోంచి వెళ్ళిపోతున్నానని గడపదాటుతుండగా తల్లి 'నీవంటి మీదున్న బట్టలు నీ తండ్రి సంపాదనే గుర్తుంచుకో'మంది. అంతే వాటినలాగే వదిలి తన కర్తవ్యాన్ని తెలుసుకున్నాడు. రైల్లో స్వీట్లమ్మాడు. కుటుంబపోషణలో భాగం పంచుకున్నాడు. సినిమాల్లో చిన్నాచితకా వేషాలు వేయనారంభించాడు. అంతకుముందు న్యూస్ పేపర్లు అమ్మాడు. కోళ్ళఫారం నడిపాడు. ఈ మధ్యలో మీనాకుమారికి టేబుల్ టెన్నిస్ నేర్పేందుకు కుదిరి ఆమె చెల్లెలు మాధురిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు.

పెళ్ళి తరువాత ఆయన జీవితం మారింది. చాలా మంది దర్శకుల వద్ద అసిస్టెంట్‌గా చేశాడు. 'నాదాన్' సినిమా షూటింగ్‌లో ఓ జూనియర్ ఆర్టిస్ట్ సరిగా చేయకపోవడంతో ఆ డైరెక్టర్ అతన్ని తప్పుకోమని ఆ స్థానంలో మెహమూద్‌ను నటించమన్నాడు. నాదాన్‌లో హీరోయిన్ మధుబాల. మధుబాలను చూస్తే ఆ రోజుల్లో ప్రేక్షకుల హృదయాలు పులకించిపోయేవి. ఆ సీన్‌లో మెహమూద్ ఆమెకు "లైన్" వేయాలి. అదే సైట్ కొట్టాలి. నటనలో మెహమూద్ కొట్టిన "సైట్", ఆమె తను చెప్పవలసిన డైలాగ్‌ను మరిపించింది. అంతా మెచ్చుకున్నారు. అది మొదలు సినిమా యాక్టరుగానే కొనసాగాలనుకున్నాడు మెహమూద్.

ఇతను ఫీల్డులోకి వచ్చేనాటికి జానీవాకర్ హాస్యానికి ఆల్‌రౌండర్‌గా వెలుగొందుతున్నాడు. మనవాడు అతనికి చెంచాగా మసలుకొనేవాడు. జానీవాకర్‌కి సిగరెట్ పెట్టెలు మోస్తూ అందులో ఒకటీ రెండు కొట్టేసి తనూ కాలుస్తూ ఉండేవాడు. జానీవాకర్, గురుదత్ "సి.ఐ.డి."లో మెహమూద్‌కి ఓ వేషం ఇప్పించాడు. ఆ వెంటనే 'ప్యాసా'లో కూడా వేశాడు. ఈ రెండు వేషాలూ అతనికో గుర్తింపు తెచ్చాయి. ఇంకా "పర్వరిశ్" (1959) కూడా ఇలాంటివే.

ఇంతలో మన తెలుగువాడైన ఎల్.వి.ప్రసాద్ హిందీలో తాతినేని ప్రసాదరావు దర్శకత్వంలో తీసిన "సుసురాల్" (ఇల్లరికం - రీమేక్) మెహమూద్‌కు ఒక్కసారిగా స్టార్‌డమ్ తెచ్చిపెట్టింది. అప్పటి వరకు జానీవాకర్ ఇంటి ముందు వాలే అవకాశాలన్నీ మెహమూద్ గుమ్మం ముందు వాలిపోనారంభించాయి. 'మా సినిమాలో మెహమూద్ ఉంటే చాల'నుకునే స్థాయికి ఎదిగిపోయాడు.

"కాదలిక్క నేరమిల్లై" తమిళ చిత్రాన్ని తెలుగులో "ప్రేమించి చూడు"గా హిందీలో "ప్యార్‌కియే జా"గా నిర్మించారు. తమిళంలో నగేశ్, తెలుగులో చలం వేసిన పాత్రను హిందీలో మెహమూమద్ పోషించాడు. తండ్రి (ఓంప్రకాష్)ని డబ్బడిగి సినిమా తీస్తానని" వాహ్‌వాహ్ ప్రొడక్షన్స్ కంపెనీ తెరిచాడు. అంతా నవ్వుల హరివిల్లు పూయించాడు. మెహమూద్, ఇక ఆ తరువాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. 'పడోసన్', 'మై సుందర్ హూ', 'గుమ్‌నామ్', 'సబ్‌సే బడా రుపయ్యా', 'ఔలాద్', 'లాఖోంమె ఏక్', 'వారిస్', 'హమ్‌జోలి', 'ఛోటే నవాబ్', 'సాధూ ఔర్ సైతాన్', 'ప్యార్‌హీ ప్యార్', 'బాంబే టు గోవా', 'భూత్ బంగ్లా', 'జోహర్', 'మెహమూద్ ఇన్ హాంగ్‌కాంగ్', 'జెన్ని అండ్ జానీ', 'ఆంఖ్', 'జిద్దీ', 'హమ్‌రాహీ', 'లవ్ ఇన్ టోక్యో', 'దో ఫూల్' ఇలా ఆయన 300 సినిమాల జాబితా ఓ పట్టాన ఆగిపోదు.

రోజురోజుకి పెరిగిపోతున్న మెహమూద్ పాపులారిటీ అగ్రహీరోలకే కంటగింపుగా మారింది. కామెడియన్‌గా నటించే చాలా సన్నివేశాల్లో వాళ్ళని డామినేట్ చేయనారంభించాడు. దాంతో ఇతనితో పని చేయడానికి ఇష్టపడని హీరోలు ఎక్కువైపోయారు. నిర్మాతలకేమో మెహమూద్ బాక్సాఫీస్ సూత్రమై కూర్చున్నాడు. అయినా రానురాను ఇతనికి సినిమాలు తగ్గిపోయాయి. దాంతో స్వంతంగా సినీనిర్మాణం ప్రారంభించాడు. 1974లో ఆయన తీసిన మొదటి సినిమా 'కువాఁరా బాప్' హిట్ చిత్రం అయ్యింది. (తెలుగులో ఇదే చిత్రాన్ని పద్మనాభం 'పెళ్ళికాని తండ్రిగా' తీశారు). 'సత్తెకాలపు సత్తెయ్య' చిత్రాన్ని 'మస్తానా'గా తీశాడు. మొత్తం 13 చిత్రాలు తీశాడు. వాటిలో సగం ఈయన దర్శకత్వం వహించినవే. వీటిలో చాలా సినిమాలు రజతోత్సవాలు చేసుకున్నవి. 'ఛోటేనవాబ్' ద్వారా ఆర్డీ బర్మన్‌ను పరిచయం చేశాడు. 'భూత్‌బంగ్లా', 'పడోసన్' చిత్రాలు ఆయన కీర్తికిరీటంలో కలికితురాయి వంటివి. స్క్రీన్ పత్రిక ప్రకటించిన ప్రకారం 1965లో విడుదలైన హిందీ చిత్రాలలో నూరింటిలో మెహమూద్ నటించి సృష్టించిన రికార్డు నేటికీ చెదరలేదు.

తనకంటూ ఒకశైలిని ఆపాదించుకున్న కమెడియన్ మెహమూద్. 'వహ్వా'కి బదులు 'వావువా వావువా', 'కుదుకుదు', 'కచ్‌కచ్' వంటి కొత్త ఊతపదాల్ని తన మేనరిజమ్స్‌గా జనంలోకి వదిలాడు. 'హమ్‌జోలి' చిత్రంలో తాత, తండ్రి, మనవడుగా త్రిపాత్రాభినయం చేసి మూడుతరాలకు ప్రతినిధిగా పృధ్వీరాజ్, రాజ్‌కపూర్, రణధీర్‌లను అనుకరిస్తూ (కల్ ఆజ్ ఔర్‌కల్ సినిమాలోలాగ) చేసిన నటన అనితర సాధ్యం. 'గుమ్‌నామ్'లో సరదాగా పాడిన పల్లెపదం "భయ్ భత్తూర్ భయ్ భత్తూర్" ఆ తర్వాత పడోసన్‌లో హీరోయిన్ సైరాబానుకు పాటై హిట్టై కూర్చుంది.

మెహమూద్ ప్రతి సినిమాలో రెండు పాటలైనా ఉండి తీరాల్సిందే. 'ఏక్ చతుర్‌నాక్ బడీ హోషియార్', 'తెరే మన్‌కె ద్వార్ కర్‌కె సింగార్', 'హమ్ కాలే హైతో క్యాహువా దిల్‌వాలే హై', 'మై రంగీలా ప్యార్‌కా రాహి' వంటి పాటలు మెహమూద్‌పై చిత్రీకరించినవే. రఫీ, కిశోర్, మన్నాడేలు ఎవరు పాడినా అతనికి సరిగ్గా

నప్పేది. ఒక్కొక్కసారి మెహమూద్ పాటల కోసమే థియేటర్లకు జనం బారులు తీరేవారు.

మెహమూద్ వ్యక్తిగత జీవితం మాత్రం వివాదాలమయమే అయ్యింది. మీనాకుమారి చెల్లెలు మాధురిని 1953లో పెళ్ళాడి నలుగురు పిల్లలకు తండ్రయ్యాడు. ఎనిమిదేళ్ళ తరువాత 1961లో విడాకులిచ్చాడు. కారణం 'నేను ఆమె పట్ల విశ్వాసంతో వ్యవహరించలేదు. నా పట్ల ఆమె కూడా అదే విధంగా వ్యవహరించింది. ఇంతలో భారత పర్యటనకు విద్యార్థినిగా వచ్చిన అమెరికన్ 'లూసీ'ని ప్రేమించి పెళ్లాడాను. "ఆమె ప్రేమలోపడి ఆమెనే మూడుసార్లు పెళ్ళాడాను. రెండుసార్లు 'నిఖా' చేసుకున్నాను. ఒకసారి చర్చిలో పెళ్ళి చేసుకున్నానని' ఆయనే చెప్పుకున్నాడు. అయినా ఇతర మహిళలతో తిరగడానికే ఎక్కువ ఇష్టపడ్డాడు మెహమూద్. అరుణా ఇరానీ, ముంతాజ్ ఎందరో అమ్మాయిలు మెహమూద్ ప్రేమలో పడ్డారు. వాళ్ళందరినీ వదిలించుకోవడానికి 'నాకు పక్షవాతం వచ్చింద'ని చెప్పాడు. ఏదిఏమైనా 40 ఏళ్ళుగా ఆయన్ను మచ్చిక చేసుకుని భరించింది మాత్రం ఒక్క లూసీనే. మరోవైపు తన సంపాదనతో తన సోదరులందరికీ అపార్ట్‌మెంట్లు కొనివ్వడమే గాక చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు కూడా చేశాడు. తన కృషి ద్వారా వచ్చిన కీర్తి ప్రతిష్టలు మాత్రం ఆయనను దారి తప్పించి వక్రమార్గం పట్టించాయి. తీసిన సినిమాలు కొన్ని ఫెయిలైనవి. మెహమూద్ ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు సరేసరి. దాంతో మత్తు మందులకు బానిసైపోయాడు. మనశ్శాంతి కోసం బెంగుళూరుకు మకాం మార్చాడు. అక్కడే వ్యవసాయం చేసుకుంటు సినిమాలకు దూరంగా మెలిగాడు. 1985లో తనకు తానుగా మారాడు. చివరి ప్రయత్నంగా తన కొడుకు మసూద్‌ను హీరోగా చేసి 'దుష్మన్ దునియాకి' (1994) చిత్రం తీశాడు. 'అభిమాన్', 'బసేరా' టీవీ సీరియల్స్‌లో నటించాడు.

చివరి రోజుల్లో కష్టాల్లో ఉన్న మెహమూద్‌ను పలకరించేందుకు కూడా ఎవరూ రాలేదు. ఆయన సహాయం పొందిన ప్రేమ్‌జీ వంటి నిర్మాత మిత్రులు సైతం ఆయన్ను విస్మరించారు. ఏది ఏమైనా విలక్షణ సినీ విదూషకునిగా పేరొందిన మెహమూద్ జీవితం ముగింపు విషాదమైంది. అమెరికాలో జులై 23న 72వ ఏట తన నవ్వుల్ని మనకు మిగిల్చి కాలధర్మం చెందాడు. ఆయన కోరిక మేరకే స్వదేశంలోని బెంగుళూర్‌లో అంత్యక్రియలు జరిగాయి.

హిందీ హాస్యనట చక్రవర్తి మెహమూద్. మరణించిన వారం రోజులకు తెలుగింటి సినీ హాస్యపు విరిజల్లు అల్లు రామలింగయ్య మృతి చెందడం హాస్యరసానికే ఏడుపొస్తుంది. ❖



పద్మనాభం, నగేష్‌లతో మెహమూద్

స్వేచ్ఛా గీతం

అంతా సవ్యంగానే ముగిసింది
ఇప్పుడిక ఎవరూ దాన్ని పట్టుకు వేలాడాల్సిన
అవసరం లేదు
ఇష్టాయిష్ట తూకాల మధ్య ఒకడు
ఎప్పుడూ కొనసాగింపునకు కొరగాడు

దయాదాక్షిణ్యాలు లేని
స్వేచ్ఛా ప్రియత్వం సరిపడని
వేయితలల విషనాగు అది
తలలు తరిగినా లాభం లేదు
దాని పొట్ట నిండింది విషంతోనే కదా

అమాయకులను మోసగించడం
బలహీనులను కొట్టి చంపడం
ప్రియ శత్రువా..! నువ్వేం సాధించగలవ్
నీ మనిషితనాన్ని పారేసుకున్నాక

స్వేచ్ఛ అంటే మనిషి బతుక్కు అర్థం
అది ఎవడి చేతికర్రకూ భయపడదు
యుద్ధం చేస్తే ఓడేదెవరో తెలుసు
కానీ గెలిచేదెవరో చెప్పగలవా?

మూలం: విపులా నవీనా (శ్రీలంక)
స్వేచ్ఛానువాదం : ఆర్.ప్రవీణ్‌కుమార్

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

అద్దె కూడా ఇవ్వం ఇల్లు మాదంటున్నారు... ఏం చెయ్యాలి?

మాది కేశవరం గ్రామం. 1978 సంవత్సరంలో ప్రభుత్వంవారు మా అమ్మమ్మ గారికి మూడున్నర సెంట్లు పట్టాభూమి మంజూరు చేశారు. దానిలో పూరిగుడిసె నిర్మించుకుని పంచాయతీ వారికి సక్రమంగా పన్నులు చెల్లిస్తూ 1998 సంవత్సరంలో డాబా ఇల్లు నిర్మించుకున్నాం. మా అమ్మగారి తదనంతరం నాకు సంపూర్ణ హక్కులతో వీలునామా రాసి రిజిస్టరు చేశారు. 2000 సంవత్సరం మా అమ్మమ్మగారు చనిపోయారు. మా అమ్మగారు దానిని 4 సంవత్సరాల క్రితం వరసకు అక్క, బావ అయిన వార్లకు ఏ విధమైన రాతపోతలు లేకుండా అద్దెకు ఇచ్చి, నేను మా అమ్మ వ్యాపార రీత్యా వేరే ఊరిలో ఉంటున్నాం. మా అమ్మగారు అనారోగ్యంతో మొన్ననే కాలం చేశారు.

ఇపుడు నేను ఒంటరినై రుణాల పాలై నా ఇల్లు ఖాళీ చేసి నాకు అప్పగించమంటుంటే "అద్దె కూడా ఇవ్వం ఇల్లు మాది" అంటున్నారు. దౌర్జన్యం చేస్తున్నారు. నా పేరు మీద పన్నులు సక్రమంగానే చెల్లిస్తున్నా, ఆధారాలు మాఫీ చేయాలని చూస్తూ వారి పలుకుబడితో పెద్దలతో పరిష్కారం కాకుండా చేస్తున్నారు. కోర్టుకు వెళ్ళే స్తోమత నాకు లేదు. నా ఆస్తి నాకు స్వాధీనపడి, నా జీవితం నిలబడేలా తగిన సలహా వెంటనే ఇవ్వగలరు. చావబోయి చివరిగా మీ సలహాకై ఎదురు చూస్తూ...

– ఎం. విఘ్నేశ్వరరావు, మండపేట.

మీరు చెప్పిన విధంగా కాగితాలున్న మీరే ఆ ఇంటికి హక్కుదారు. మీ అమ్మగారి తదనంతరం ఏ ఆధారాలుండకపోవచ్చనే దుర్బుద్ధితో మీ బంధువులు ఆస్థి కాజేయడానికి ప్రయత్నించి ఉంటారు. మీరు వెంటనే వారిని కిరాయి కోరుతూ నోటీసు పంపించి, ఖాళీ చేయమని దావా వేయండి. ఎప్పటి నుండి కిరాయి రావాలో అది కూడా మీరడగవచ్చు. కిరాయితో పాటు వారిని ఖాళీ చేస్తూ మీరు డిక్రీ పొందగలుగుతారు. న్యాయపరమైన ప్రయత్నాలు చేయండి గానీ. చచ్చిపోవాలి, ఆత్మహత్య చేసుకోవాలని ఆలోచించడం సరైంది కాదు.

మీ డబ్బు డిక్రీ ద్వారా రాబట్టుకోవచ్చు

నా వద్ద ఒకతను 5000 రూపాయలు కూతురు పెండ్లి నిమిత్తం తీసుకొని ఇంతవరకు ఇవ్వటం లేదు. ఎప్పుడు అడిగినా ఇస్తాను అంటాడుకాని ఇంతవరకు ఒక్క పైసా కూడా జమ వేయలేదు. అదేమని అడిగితే నా దగ్గర వున్నప్పుడు ఇస్తాను అని చెప్పాడు. అతని భార్య పేర 10 సెంట్ల ఇళ్ళ స్థలం, పూరిగుడిసె వున్నది ఆ పది సెంట్లను వేరే అతని దగ్గర లక్ష రూపాయలు తీసుకొని అతని పేర తనఖా రిజిస్ట్రేషన్ చేయించాడు. నేను నా డబ్బులు రావటానికి లాయరు ద్వారా కోర్టులో దావా వేస్తే నాకు కోర్టు వారు డిక్రీ చేస్తే నా డబ్బులు వస్తాయా లేక ముందు తనఖా పెట్టుకున్న అతనికి వస్తాయా? నా డబ్బులు రావటానికి నాకు మార్గం చూపించగలరు. ఎలా చేస్తే డబ్బులు వస్తాయి? తెలుపగలరు. ఇంతకుముందే నేను దావాకు రు. 10,000లకు గాను రు. 1650లు కోర్టు ఫీజు చెల్లించాను. మీరు తగు సలహా ఇవ్వగలరు!

– కె.బి.స్వామి, తిరువూరు, కృష్ణాజిల్లా

మీ వద్ద నుండి అతను తీసుకున్న రు.5000లకు ప్రాంసరీ నోటు వున్నాదో లేదో మీరు చెప్పలేదు. ప్రాంసరీ నోటు వుంటే మీరు కోర్టుకెళ్ళాలి. తప్పకుండా మీ డబ్బులు వస్తాయి. పోతే అతడికున్న స్థలం మీరు చెప్పిన దానిని బట్టి అతడిది కాదు. అతడి భార్యది. కావున ఆ ఆస్థిపై మీరు ప్రస్తుతం క్లయిమ్ చేయలేరు. మీకు రావలసిన మొత్తం చిన్నదే కావున ముందుగా కోర్టులో దావా వేసి అది డిక్రి అయినాక అతని ఇంట్లో వస్తువుల్ని అటాచ్‌మెంట్ అడగవచ్చు. అదీ కాక అతనిని అరెస్టు చేయుమని కూడా అడగవచ్చు. తక్కువ మొత్తం కట్టలేక జైలుకెళ్ళడానికైతే సిద్ధపడకపోవచ్చు. కాబట్టి మీ డబ్బు అలా రాబట్టుకోవచ్చు.

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :

న్యాయసలహాలు
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం. 1,
అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

రుచి

సేమ్యా స్వీట్ డ్రీమ్



కావలసిన వస్తువులు :

సేమ్యా	: రెండు కప్పులు
బొంబాయి రవ్వ	: ఒక కప్పు
కిస్‌మిస్	: నాలుగు టీ స్పూన్లు
పంచదార పొడి	: ఒకటిన్నర కప్పు
పాలు	: మూడు కప్పులు
నెయ్యి	: రెండు టీ స్పూన్లు

తయారుచేసే విధానం :

బాండీలో నెయ్యివేసి వేడిచేసి రవ్వను లైట్‌గా వేయించుకోవాలి. సేమ్యాను కూడా కొంచెం నెయ్యివేసి లైట్‌గా వేయించాలి. వీటిని ఓ గిన్నెలో పోసి అందులో పాలు, పంచదార పొడి వేసి కలిపి ఓ అరగంట ఉంచాలి. పాలను పీల్చుకొని మిశ్రమం గట్టి పడుతుంది. దీనిని ఇడ్లీ ప్లేట్‌కు నెయ్యిరాసి ఇడ్లీ మాదిరిగా వెయ్యాలి. చాలా సులువుగా స్వీట్ రెడీ. ఈ ఇడ్లీలపై కిస్‌మిస్‌తో అలంకరించి చల్లార్చి ముక్కలుగా చేసి సర్వ్ చేయాలి. చల్లగా కావాలంటే ఓ పది నిముషాలు ఫ్రిజ్‌లో పెట్టి సర్వ్ చేయవచ్చు.

అటుకులతో కట్‌లెట్స్

కావలసిన వస్తువులు :

అటుకులు	: ఒక కప్పు
బంగాళాదుంపలు	: ఉడికించిన తురుము ఒక కప్పు
ఉల్లిపాయ ముక్కలు	: ఒక కప్పు
పచ్చిమిర్చి ముక్కలు	: పావు కప్పు
కొత్తిమీర	: ఒక కట్ట
ఉప్పు	: తగినంత
అల్లం	: చిన్న ముక్క
నిమ్మరసం	: రెండు స్పూన్లు
నూనె	: తగినంత

తయారుచేసే విధానం :

అటుకులు పల్చనివైతే పది నిముషాలు, దంపుడువైతే ఒక గంట కడిగి నానబెట్టుకోవాలి. వీటిలో బంగాళాదుంప ఉడికించిన ముక్కలు, ఉప్పు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీద ముక్కలు, నిమ్మరసం అన్నీ వేసి బాగా కలపాలి. దీనిని చిన్నచిన్న టిక్కీలుగా చేసుకుని పెనంపై వేసి రెండు వైపులా నూనెవేసి కాల్చుకోవాలి. లేదా నూనెలో వేసి కాల్చి తీసుకోవచ్చు. వీటిని మనకు నచ్చిన షేపుల్లో చేసుకోవచ్చు. ఇవి వేడివేడిగా చాలా రుచిగా ఉంటాయి.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్ధసంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది